RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 21 | బుధవారం, ఫిబ్రవరి 14, 2024 | పేజీలు : 4

## స్నేహితుడి ప్రాణం తీసిన పాత పగ

రాజన్నసిరిసిల్ల: పాత పగను లోపల ఉంచుకొని స్నేహితుడిని నమ్మించి గొంతు కోసి చంపిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ మండలం కేంద్రంలోని ఓల్డ్ అర్బన్ కాలనీలో కురుకుంట్ల శ్రీధర్(24), బాబు స్నేహితులుగా ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఇద్దరు మధ్య చిన్న గొడవ జరగడంతో బాబు బైక్‌ను శ్రీధర్ బాబు తగలబెట్టాడు. అప్పటి నుంచి శ్రీధర్‌పై బాబు పగ పెంచుకున్నాడు.

అతడితో స్నేహంగా నటిస్తూనే అంతం చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. ఆదివారం రాత్రి శ్రీధర్‌ను నమ్మించి వేములవాడ శివారులోని బైపాస్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అర్ధరాత్రి వరకు ఇద్దరు మద్యం తాగిన అనంతరం శ్రీధర్‌ది బాబు గొంతు కోసి చంపేశాడు.

## సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రకటించిన ప్రధాన మంత్రి



**డిల్లి (గరుడ వార్త) :** ఉచిత విద్యుత్తు కోసం ఉద్దేశించినటువంటి రూఫ్ టాప్ సోలర్ స్కీమ్ – పిఎమ్ సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రారంభించినట్లు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున ప్రకటించారు. ప్రధాన మంత్రి ఎక్స్ మాధ్యంలో నమోదు చేసిన ఒక సందేశంలో – "దీర్ఘకాలంపాటు మన్నికను కలిగివుండేటటువంటి అభివృద్ధి మరియు ప్రజల శ్రేయం కోసం, మేం 'పిఎమ్ సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' ను ప్రారంభిస్తున్నామన్నారు. 75,000 కోట్ల రూపాయల కు పైచిలుకు పెట్టుబడితో కూడినటువంటి ఈ ప్రాజెక్టు ప్రతి నెలా 300 యూనిట్ ల వరకు ఉచిత విద్యుత్తును సమకూర్చడం ద్వారా ఒక కోటి కుటుంబాల జీవనంలో వెలుగులను నింపాలి అనే లక్ష్యాన్ని కలిగివుందిన్నారు. "గణనీయమైన సబ్సిడీలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాలలో పంపిణీ చేయడం మొదలుకొని అత్యధిక రాయితీతో కూడిన బ్యాంకు రుణాల వరకు ప్రజలపై ఎటువంటి వ్యయ భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం పూచీ పడుతుంది. స్టేక్ హోల్డర్స్ అందరిని ఒక జాతీయ ఆన్‌లైన్ పోర్టల్ కు కలపడం జరుగుతుంది. ఫలితంగా ఎక్కువ సౌకర్యం లభిస్తుంది." "క్షేత్ర స్థాయిలో ఈ పథకం ప్రజాదరణకు పాత్రం అయ్యేటట్లు చూడడం కోసం, పట్టణ స్థానిక సంస్థలకు మరియు పంచాయతీలకు వాటి న్యాయాధికార పరిధులలో ఇళ్ల పైకప్పు భాగాలలో సోలర్ సిస్టమ్స్ ను పెంపొందింప చేసేటట్టుగా ప్రోత్సహించడం జరుగుతుంది. దీనితోపాటే, ఈ పథకంతో ప్రజలకు ఆదాయం అధికం అవుతుంది, విద్యుత్తు బిల్లు తగ్గుతుందన్నారు. నివాస గృహాల వినియోగదారులు అందరు దరఖాస్తు పెట్టుకొని 'పిఎమ్ – సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'ను లబ్ది పొందాలని ఆకాంక్షించారు.

## మేడిగడ్డ ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్ట్: ఉత్తమ్



**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి, 13 :** స్వాతంత్ర భారతదేశం లో ఇంత పెద్ద కుంభకోణం ఇంకోటి లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఎఎల్ఎల బృందం కాళేశ్వరంలో పర్యటించి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 94 వేల కోట్ల ఖర్చుతో 90 వేల ఎకరాలకు నీళ్ళించారని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్ట్ కట్టారని, 38 వేల కోట్ల ప్రాజెక్ట్ ను రీడిజైన్ పేరుతో 94 వేల కోట్ల ఖర్చు పెట్టారని ధుయ్యబట్టారు. ఇంకా 30 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్ట్ పూర్తి అవుతుందని, బ్యారేజ్ కట్టి నీటిని నిల్వ చేసి ఎన్నికల ముందు పబ్లిసిటీ చేసుకున్నారని మండిపడ్డారు. ఇది భారీ కుంభకోణమని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. అక్టోబర్ 21న ప్రమాదం జరిగితే ఈ రోజు వరకు కూడా కెసిఆర్ ఒక్క మాట మాట్లాడలేదని, నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు ముందే చెప్పారని, మేడిగడ్డ ప్రాజెక్ట్ ఒక ఫెయిల్యూర్ ప్రాజక్ట్ అని తెలిపారని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. పూర్తీ సమాచారంతో డ్యాం సేఫ్టీ అధికారుల సూచనలతో ముందుకు పోతామని పేర్కొన్నారు. 94 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృదా చేసి నామ మాత్రపు కొత్త ఆయకట్టు తయారు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కోటి ఎకరాలకు సాగు నీరు అందించాం అని గత ప్రభుత్వం చెప్పిన మాట అంతా అబద్ధమని, లక్ష కోట్లు ఖర్చు చేసిన లక్ష ఎకరాలకు కూడా గత ప్రభుత్వం సాగునీరు ఇవ్వలేదన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్వహణ, విద్యుత్ బిల్‌కు ఏటా రూ. 25 వేల కోట్ల బడ్జెట్ అవసరమన్నారు. 2020లోనే మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపం ఉందని ఇరిగేషన్ అధికారులు ఎల్అండ్ టికి లేఖ రాసిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందన్నారు.

### కాళేశ్వరంతో లక్ష ఎకరాలకు కూడా...

## నీరు ఇవ్వలేదు



**హైదరాబాద్ ఫిబ్రవరి, 13 :** కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఎఎల్ఎల బృందం కాళేశ్వరంలో పర్యటించి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సిఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టినా లక్ష ఎకరాలకు నీరు అందలేదని, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరు ఇచ్చామని అబద్ధాలు చెప్పారని చురకలంటించారు. మేడిగడ్డ నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని నేషనల్ డ్యామ్ సెఫ్టీ అథారిటీ చెప్పిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు కెసిఆర్ అబద్ధాలతోనే కాలం గడిపారని, 2020–21లోనే సమస్య ఉందని ఇంజినీర్లు చెప్పినా కూడా కెసిఆర్ పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. సమస్యను చక్కదిద్దే పని చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తారా? అని ప్రశ్నించారు. రూ. 94 వేల కోట్లు ఖర్చు చేసి నీళ్లు ఇచ్చిందని 98,570 ఎకరాలకు మాత్రమేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ. 10,500 కోట్లు వస్తుందని, కాళేశ్వరం రుణాలు, ఇతర ఖర్చులు కలిపి ఏటా రూ. 25 వేల కోట్లు అవసరం అవుతాయని, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కట్టిన ఏ బ్యారేజీలోనూ ఇప్పుడు నీరు లేదని, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో ఒకే తరహా సమస్య ఉత్పన్నమవుతుందని, ప్రస్తుతం సీపేజీ చేసి అన్నారం, సుందిళ్లలో సమస్యను కప్పిపుచ్చారని, వానాకాలం వస్తే సుందిళ్ల, అన్నారంలో కూడా సమస్యలు బయటపడుతాయని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నీళ్లు నింపితే ఇష్యూ వస్తుందని బ్యారేజీల్లో నీళ్ల లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### మేమొస్తే ఎంఎస్‌పికి చట్టబద్ధత

## తొలి గ్యారంటీ

న్యూఢిల్లీ : రైతులు తమ పంటలకు న్యాయసమ్మతమైన డిమాండ్లతో ముందుకు సాగుతున్నారని, వీరిని దమననీతితో కేంద్ర ప్రభుత్వం అడ్డుకొంటోందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం విమర్శించింది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతుల న్యాయబద్ధమైన డిమాండ్లకు అంగీకారం తెలిపితీరుతామని, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధమైన గ్యారంటీ కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందీలో సామాజిక మాధ్యమంలో స్పందించారు. రైతుల యాత్ర కేవలం ఆరంభమే అని, ఇది వారి సమస్యల పరిష్కారం వరకూ ఆగబోదని కాంగ్రెస్ తెలిపింది. రైతులు పండించే వివిధ రకాల పంటలకు తప్పనసరిగా గిట్టుబాటు ధరలు అందాల్సిందే అని, ఇది న్యాయసమ్మతం అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఈ అంశంపై స్పందిస్తూ రైతులకు పార్టీ పూర్తి స్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు, ఇకనైనా ప్రధాని మోడీ భేషజాలు వీడి రైతుల నేతలతో నేరుగా చర్చలు జరిపితీరాలని, వారికి న్యాయం జరిగేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

రైతుల ఢిల్లీ చలో చారిత్రక ఘట్టం అని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలిగా ప్రకటించేది కిసాన్‌న్యాయ్ గ్యారెంటీ అని రాహుల్ వెల్లడించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో సాధించింది ఏమీ లేదని , రైతులకు వాగ్దానభంగంతోనే పొద్దుగడిపిందని విమర్శించారు.

## 'ఢిల్లీ చలో'కు... రాకేష్ తికాయత్ మద్దతు



న్యూఢిల్లీ : ప్రభుత్వ 'నల్ల సాగు చట్టాల'కు వ్యతిరేకంగా 2020/21లో నిరసన ప్రదర్శనలకు సారథ్యం వహించిన కీలక నేత రాకేష్ తికాయత్ ప్రస్తుతం సాగుతున్న రెండవ 'ఢిల్లీ చలో' ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ ఉద్యమం మంగళవారం ప్రారంభమైంది. పంజాబ్, హర్యానా సరిహద్దులో శంభు వద్ద రైతులపై బాష్పవాయు ప్రయోగం జరిగింది. అది రైతులు, పోలీస్ బలగాల మధ్య సంఘర్షణలకు దారి తీసింది. 'రైతులకు ప్రభుత్వం సమస్య సృష్టించినట్లయితే చూస్తూ ఊరుకోం' అని తికాయత్ అధికార బిజెపికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు రైతులు ప్రారంభించిన నిరసన ప్రదర్శనల నియంత్రణకు బిజెపి మార్గాలను అన్వేషిస్తోంది. 'పెక్కు రైతు సంఘాలు ఉన్నాయి. వారికి వేర్వేరు సమస్యలు ఉన్నాయి. ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులకు ప్రభుత్వం ఏదైనా సమస్యసృష్టించినట్లయితే మేమేమీ వారికి దూరంగా లేము. వారికి దన్నుగా ఉన్నాం' అని తికాయత్ చెప్పారు. తికాయల్ ఉత్తర ప్రదేశ్ కేంద్రంగా గల భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు)కు చీఫ్. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ స్థాపించిన సంఘం అది. రైతుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16న 'భారత్ బంద్' పాటించాలని రాకేష్ తికాయత్ క్రితం నెల పిలుపు ఇచ్చారు.

## 6 నెలలకు సరిపడ రేషన్, డీజిల్



న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధన కోసం దేశ రాజధాని వైపు పంజాబ్ నుంచి ట్రాక్టర్లలో బయల్దేరిన వేలాదిమంది రైతులు కొన్ని నెలలకు సరిపడ రేషన్, డీజిల్‌ను తమ వెంట తీసుకెళుతున్నారు. నిరసనకారులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం శివార్లను మూసివేసినప్పటికీ అడ్డంకులను ఛేదించుకుని రైతులు ముందుకు సాగుతున్నారు. 2020లో ఢిల్లీ శివార్లలో బసచేసి దాదాపు 13 నెలలపాటు ఆందోళన చేసిన రైతులు ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలుచేయనందుకు మరోసారి నిరసనబాట పట్టారు. తమ పంటలకు కనీస మద్దతుధర(ఎంఎస్‌పి) కల్పించడంతోపాటు ఇతర డిమాండ్ల సాధన కోసం రైతులు సమరశంఖం పూరించారు. తమ డిమాండ్లను సాధించుకునే వరకు తాము వెనుదిరిగే ప్రసక్తి లేదని, తమ సహనానికి ప్రభుత్వం ఎంతకాలమైనా పరీక్ష పెట్టుకోవచ్చని రైతులు సవాలు చేశారు. సూది నుంచి సుత్తి దాకా మా ట్రాలీలలో సమస్తం ఉన్నాయి. రాళ్లను పగలగొట్టే పరికరాలతో సహా అన్నీ మా వద్ద ఉన్నాయి. ఆరు నెలలకు సరిపడ రేషన్‌తో మా గ్రామాన్ని వదిలాం. హర్యానాకు చెందిన మా సోదరులకు కూడా సరిపడేంత డీజిల్ మా వద్ద ఉంది అని పంజాబ్‌లోని గుర్దాస్‌పూర్‌కు చెందిన హర్భజన్ సింగ్ అనే రైతు తెలిపారు.

## రాజకీయ లబ్ధి కోసమే మేడిగడ్డ పర్యటన



**హైదరాబాద్ ఫిబ్రవరి, 13 :** రాజకీయ లబ్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటన చేపట్టారని కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం, ఆరు గ్యారెంటీలను తప్పుదారి పట్టించేందుకు మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శన తెరపైకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందుగానే మేడిగడ్డ పర్యటన చేసిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు పర్యటన చేస్తున్నారో, తెలంగాణ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని నిలదీశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఆలోచనతోనే రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలను సైతం ముగించుకొని ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను మేడిగడ్డ సందర్శనకు తీసుకుపోయారని విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ దెబ్బతిన్నడంపై గతంలోనే జల శక్తి వనరుల శాఖ మంత్రికి లేఖ రాశామని సీబీఐ ద్వారా విచారణ చేయాలని గత ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

### సిఇసి, ఇసిల నియామకం చట్టంపై

## స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)కి సభ్యత్వం లేని కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసిల) నియామకానికి వీలు కల్పిస్తున్న కొత్త చట్టం అమలుపై స్టే ఇవ్వడానికి సుప్రీం కోర్టు మంగళవారం నిరాకరించింది. ఒక ఎన్‌జిఒ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం నోటీస్ జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్‌లతో పాటు ఈ పిటిషన్‌ను ఏప్రిల్‌లో విచారిస్తామని బెంచ్ తెలియజేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (నియామకం, ఉద్యోగ నిబంధనలు, పదవీ కాల పరిమితి చట్టం 2023 రాజ్యాంగ బద్ధతను ఈ పిటిషన్ సవాల్ చేసింది.



## శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం



**శామీర్ పేట, (గరుడ వార్త):** శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామానికి చెందిన వల్లపు మైసూరి- శాంత దంపతులు, వి.సాయిరాం, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. అలాగే శామీర్ పేట గ్రామానికి చెందిన కమ్మరి రాజులు- లక్ష్మీదంపతులు రూ. 1020 లు అన్నదానం కు అందజేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలం కు చెందిన భక్తులు, రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

### మౌలిక వసతుల కల్పనలో...

# నిర్లక్ష్యం లేకుండా వీలైనంత త్వరలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించండి

## : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** పీర్జాదిగూడలోని డంపింగ్ యార్డ్, పార్క్ తో పాటుగా బోడుప్పల్ లోని పార్క్, డంపింగ్ యార్డ్, మైనారిటీ బాలికల పాఠశాల ను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ డ్రై రిసోర్సు సెంటర్ ను మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్నా తడి చెత్తను పొడి చెత్తగా మార్చే విధానం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాసెస్ చేసినవ్యర్థ పదార్థాలను జవహర్ నగర్ డంప్ యార్డుకి పంపించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం బుద్దనగర్ లోని పార్కును సందర్శించి పాదచారులకు కావలసిన సదుపాయాలు కల్పించాలన్నారు. తరువాత బోడుప్పల్ లక్ష్మి నగర్ లోని హుడా పార్క్ సందర్శించి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సందర్శకులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలని అన్నారు. పిల్లలు, పెద్దలు ఆడుకోవడానికి అనువుగా ఆట స్థలాల అభివృద్ధి మరియు సేద తీర్చడానికి మరికొన్ని పార్కులు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడి నుండి మల్లికార్జున నగర్ లోని మైనారిటీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల ను కలెక్టర్ తనిఖీ చేసి పిల్లలతో ముచ్చటిస్తూ... ఇప్పుడు మీరు ఎంత కష్టపడి బాగా చదువుకుంటే అది మీభవిష్యత్తును ఉన్నత శిఖరాలకు చేర్చడంలో దోహదపడుతుందన్నారు. వసతి గృహంలో భోజన పట్టిక ప్రకారం భోజనం పెడుతున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వీధి వ్యాపారుల కోసం నిర్మాణంలో ఉన్న వెజ్ నాన్వెజ్ మార్కెట్ ల భవన సముదాయములను సందర్శించి నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. బోడుప్పల్ లోని రా చెరువు ను పరిశీలించి, సుందరీకరణ పనుల పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న నీటి పారుదల శాఖ మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో రా చెరువు సుందరీకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో బోడుప్పల్ మున్సిపల్ కమీషనర్ వేణుగోపాల్ రెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కమీషనర్ నమ్య ఇస్లావత్, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# జెఇఇ మెయిన్ ఫలితాలలో తెలుగు విద్యార్థుల సత్తా



**- 10 మంది విద్యార్థులకు 100 పర్సంటైల్**

**- జెఇఇ మెయిన్ తొలి విడత ఫలితాలు విడుదల**

హైదరాబాద్ : దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జెఇఇ మెయిన్ తొలి విడత పరీక్ష ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాల్లో మొత్తంగా 23 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) వెల్లడించింది. వారిలో తెలుగు విద్యార్థులు 10 మంది 100 పర్సంటైల్ సాధించారు. తెలంగాణకు చెందిన రిషి శేఖర్ శుక్లా, పబ్బ రోహన్ సాయి, ముతవరపు అనూప్, హుందేకర్ విదిత్, మదినేని వెంకట సాయి తేజ, కల్లూరి శ్రియాషస్ మోహన్, తవ్వ దినేశ్ రెడ్డి, ఆంధ్రప్రదేశకు చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తిక్, అన్నారెడ్డి వెంకట తనీశ్ రెడ్డి 100 పర్సంటైల్ స్కోరు సాధించారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన జెఇఇ మెయిన్ తొలి విడత పేపర్ -1 పరీక్షకు దేశవ్యాప్తంగా 11,70,036 మంది విద్యార్థులు (95.8 శాతం) హాజరైన విషయం తెలిసిందే. ఆ ఫలితాలను మంగళవారం వెల్లడించారు.

**పరీక్ష రాసిన 11,70,048 మంది విద్యార్థులు**

జెఇఇ మెయిన్ - 2024 తొలి విడత పరీక్షలను ఈ ఏడాది జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు దేశవిదేశాలలో 291 నగరాలలో 544 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. వివిధ తేదీల్లో జరిగిన రాసేందుకు దేశ వ్యాప్తంగా 12,21,624 మంది దరఖాస్తు చేసుకోగా, 11,70,048 మంది(95.8 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పేపర్ 1 (బిఇ/బి.టెక్ కోర్సులు) పరీక్ష రాసేందుకు 11.70 లక్షల మంది హాజరు కాగా.. వీరిలో 3,81,808 మంది పైగా అమ్మాయిలు, 7,88,238 మంది అబ్బాయిలు ఉన్నారు. జెఇఇ మెయిన్ చివరి విడత (సెషన్ 2) ఏప్రిల్ 4 నుంచి 15 మధ్య నిర్వహించనున్నట్లు ఎన్‌టిఎ ప్రకటించింది. తొలి విడత రాసిన విద్యార్థులు.. రెండో విడతకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి (రెండు విడతలు రాస్తే) తీసుకుంటారు. జెఇఇ మెయిన్ అర్హత సాధించిన వారిలో టాప్ 2.2 లక్షల మంది విద్యార్థులకు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

**దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు**

1. ఆరవ్ భట్(హర్యానా)
2. రిషి శేఖర్ శుక్లా(తెలంగాణ)
3. షేక్ సూరజ్(ఆంధ్రప్రదేశ్)
4. ముకుంద్ ప్రతీష్ ఎస్(తమిళనాడు)
5. మాధవ్ బన్సాల్(ఢిల్లీ)
6. ఆర్యన్ ప్రకాశ్(మహారాష్ట్ర)
7. ఇషాన్ గుప్త (రాజస్థాన్)
8. ఆదిత్య కుమార్(రాజస్థాన్)
9. రోషన్ సాయి పబ్బ(తెలంగాణ)
10. పరేఖ్ మీట్ విక్రమ్‌భాయి(గుజరాత్)
11. ఆమోఘ్ అగర్వాల్(కర్ణాటక)
12. శివాన్ష్ నాయర్(హర్యానా)
13. తోట సాయి కార్తీక్(ఆంధ్రప్రదేశ్)
14. గజారె నీల్‌కృష్ణ నిర్మల్‌కుమార్(మహారాష్ట్ర)
15. దక్షేష్ సంజయ్‌కుమార్(మహారాష్ట్ర)
16. ముతవరపు అనూప్(తెలంగాణ)
17. హిమాన్షు తాలోర్(రాజస్థాన్)
18. హుందేకర్ విధిత్(తెలంగాణ)
19. వెంకటసాయి తేజ మదినేని(తెలంగాణ)
20. ఇప్సిత్ మిట్టల్(ఢిల్లీ)
21. అన్నారెడ్డి వెంకట తనీష్ రెడ్డి(ఆంధ్రప్రదేశ్)
22. శ్రియాషస్ మోహన్ కల్లూరి(తెలంగాణ)
23. తవ్వ దినేష్ రెడ్డి(తెలంగాణ)

**కష్టపడితేనే ఫలితం : రిషి శేఖర్ శుక్లా**

కష్టపడితేనే ఫలితం లభిస్తుందని జెఇఇ మెయిన్‌లో 100 పర్సంటైల్ సాధించిన తెలంగాణ విద్యార్థి రిషి శేఖర్ శుక్లా అన్నారు. జెఇఇ మెయిన్ సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధమయ్యానని పేర్కొన్నారు. ప్రతిరోజు ఒక్కో సబ్జెక్టు దాదాపు మూడు గంటల చదివానని తెలిపారు. పరీక్షలకు ప్రిపేరవుతున్న సమయంలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు మెడిటేషన్, యోగా చేశానని చెప్పారు.

# ఏసీబీ వలలో శామీర్పేట తహాశీల్దార్

**- బదిలీ ఉత్తర్వులు తీసుకొని నల్గొండ జిల్లాలో చేరాల్సి ఉండగా అంతలోనే**

**- 10 లక్షల రూపాయలు ఇచ్చి సంవత్సరం కావస్తున్న తమ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వలేదంటున్న బాధితుడు**

**- మరో 10 లక్షలు రూపాయలు డ్రైవర్ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**





**శామీర్ పేట, (గరుడ వార్త) :** తహశీల్దార్ ఏసీబీ వలకు చిక్కిన సంఘటన శామీర్ పేట లో చోటు చేసుకుంది. బాధిత రైతు మువ్వ రామశేషగిరిరావు తెలిపిన సంఘటన వివరాలు అనుసారం... గుంటూరు జిల్లా నీడబ్రోలు ప్రాంతానికి చెందిన మువ్వ రామశేషగిరిరావు అనే రైతు శామీర్ పేట మండలం, లాల్ గడి మలక్ పేట గ్రామ పరిధిలో 2006లో సుమారు 29 ఎకరాల వ్యవసాయ భూమిని పట్టాదారు నుండి కొనుగోలు చేశారు. దీంతో 2013లో అతనికి పట్టాదారు పాస్ పుస్తకంతోపాటుగా, అతని వివరాలు అడంగల్పహానిలో సైతం నమోదు చేసినట్లుగా తెలిపారు. అయితే కొందరు అతని భూమిని అన్యాయంగా ఆక్రమిద్దామని ఓ పథకం ప్రకారం తప్పుడు కేసు వేసి భూమిని లాక్కునే ప్రయత్నం చేయగా... సదరు బాధితుడు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆశ్రయించన్ననారు. దీంతో అట్టి భూమిపై స్టేటస్కో తెచ్చుకున్నాడు. చివరకు గత సంవత్సరం న్యాయస్థానం బదిరుతుడికే సదరు భూమిపై హక్కు ఉందని తెలుపుతూ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. తర్వాత అతని ప్రత్యర్థులు తిరిగి హైకోర్టులోనే ఆపిల్ ఫైల్ చేయగా, అందులో సైతం తన వైపే తీర్పు వచ్చినట్లుగా తెలిపారు. ఇంతటితో ఆగకుండా అతని ప్రత్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అక్కడ సైతం సదరు బాధితుడు వైపే తీర్పు రావడంతో, సదరు బాధితుడు ఆన్లైన్ ద్వారా తనకు పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని ధరణి పోటాల్లో నమోదు చేసుకున్నాడని, అయితే సంబంధిత తాసిల్దార్ మాత్రం అతన్ని సుమారు 30 లక్షల రూపాయలు అడిగారని, అందుకు వారు పది లక్షల రూపాయల నగదు సంవత్సరం క్రితమే ఇచ్చామని తెలిపారు. కానీ అయినప్పటికీ తమ పేరును పటదార పాస్ పుస్తకం ఇవ్వకపోగా కార్యాలయం చుట్టూ సంవత్సరం కాలంగా తిప్పుకుంటున్నారని, తర్వాత మరో 20 లక్షల రూపాయల చెక్కులు సైతం ఇచ్చినట్లుగా తెలిపారు. అయినప్పటికీ చేయకపోగా మరో 10 లక్షల రూపాయలు సైతం డిమాండ్ చేయడంతో, ఈరోజు 10 లక్షల రూపాయలు అతని డ్రైవర్ బద్రయ్య ద్వార ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లుగా సదరు బాధితుడు శేషగిరిరావు తెలిపారు. దీంతో ఏసీబీ డిఎస్పీ మాజిద్ అలీఖాన్ తోపాటు అతని బృందం తూముకుంట, కరీంనగర్ లలోని తహశీల్దార్, బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహించారు.

## మనీలాండరింగ్ కేసులో ఎపి, కర్నాటకలో ఇడి సోదాలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్‌కు సంబంధించిన ఒక కేసులో కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రదేశాలలో జరిపిన సోదాలలో లెక్కల్లో చూపని రూ. 31 లక్షల నగదు, అత్యంత విలువైన అనేక కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) మంగళవారం ప్రకటించింది. సూర్య నారాయణ రెడ్డి, భరత్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులపై పిఎంఎల్ఎలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇడి తెలిపింది. కర్నాటకలోని బళ్లారిలో నమోదైన ఒక ఎఫ్ఐఆర్ ఆధారంగా ఫిబ్రవరి 10న సోదాలు నిర్వహించినట్లు ఒక ప్రకటనలో ఇడి తెలిపింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు దాదాపు రూ. 42 కోట్ల నగదును సమీకించిన భరత్ రెడ్డి చట్ట వ్యతిరేక కార్యకలాపాల కోసం ఈ నిధులను వినియోగించినట్లు తమకు కీలక ఆధారాలు లభించాయని ఇడి తెలిపింది. తాము జరిపిన సోదాలలో అత్యంత కీలకమైన పత్రాలు, వ్యాపార రికార్డులు, స్థిర చరాస్తులకు చెందిన వివరాలు లభించాయని తెలిపింది.

# కరవడి- సూరారెడ్డిపాలెం స్టేషన్ల మధ్య ద.మ. రైల్వే విద్యుదీకరణ... మూడో లైన్ ప్రారంభం

హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే అంతటా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాముఖ్యతనిస్తూ డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశలో భాగంగా కరవడి - సూరారెడ్డిపాలెం




మధ్య 20.3 కి.మీ.ల మేర మరో సెక్షన్‌ను విజయవంతంగా పూర్తి చేసి ప్రారంభించింది. ఈ సెక్షన్ విజయవాడ -గూడూరు ట్రిప్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టులో భాగం కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టులలో ఇదీ ఒకటి కాగా ఈ రైలు మార్గం ప్రకాశం జిల్లా పరిధిలోకి వస్తుంది. ఇప్పుడు ఈ మార్గాన్ని ట్రిప్లింగ్ చేయడంతో బాపట్ల - సూరారెడ్డిపాలెం మధ్య 81 కిలో మీటర్ల మేర నిరంతరాయంగా విద్యుదీకరణతో పాటు మూడో లైన్ సౌకర్యం కలగనుంది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ - గూడూరు మధ్య గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉన్నఈ సెక్షన్, దేశంలోని ఉత్తర , తూర్పు ప్రాంతాలను దక్షిణాది రాష్ట్రాలతో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్యాసింజర్ సరకు రవాణా రైళ్లలో స్థిరమైన పెరుగుదలతో ఈ మార్గం అత్యంత రద్దీగా మారింది. ఈ కీలకమైన సెక్షన్‌లో రద్దీని తగ్గించేందుకు, విజయవాడ - గూడూరు మూడవ లైన్ ప్రాజెక్ట్ 2015 -16 సంవత్సరంలో 288 కి .మీల దూరానికి సుమారు రూ. 3,246 కోట్లతో మంజూరు చేశారు. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ద్వారా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ అన్ని విభాగాల్లో ఏకకాలంలో పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు గూడూరు- సింగరాయకొండ మధ్య 127 కిలోమీటర్ల మేర బాపట్ల- కరవడి మధ్య 62 కి.మీ.ల మేర సెక్షన్లు పూర్తి చేసి విజయవంతంగా ప్రారంభించారు. ప్రస్తుతం విజయవాడ - గూడూరు మధ్యలో ఉన్న కరవడి - ఒంగోలు - సూరారెడ్డిపాలెం మధ్య 20 కి.మీల మేర సెక్షన్ పూర్తితో మొత్తం సెక్షన్‌లోని 209 కి.మీ.లు మూడో లైన్ తో పాటు విద్యుద్దీకరణ పూర్తి అయింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కరవడి- సూరారెడ్డిపాలెం సెక్షన్ మధ్య ట్రిప్లింగ్ విద్యుదీకరణ పనులను పూర్తి చేసిన విజయవాడ డివిజన్‌లోని బృందాన్ని , అధికారులను అభినందించారు. విజయవాడ-గూడూరు మధ్య మూడో లైన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్నామని, అన్ని విభాగాలలో ఏకకాలంలో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ రద్దీని తగ్గిస్తుందన్నారు. రైలు కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుందని ఆయన తెలియజేశారు.

# ప్రజలకు నిజాలు చెప్పాల్సిన అవసరం తమపై ఉంది: ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్: తెలంగాణ నదీ జలాలపై కేంద్రం పెత్తనాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేండ్లుగా అడ్డుకున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అయితే నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మాత్రం కేవలం రెండు నెలల్లోని కృష్ణ, గోదావరి నది జలాల బోర్డులకు నదుల నిర్వహణను అప్పజెప్పిందని విమర్శించారు. తెలంగాణ రైతాంగం భవిష్యత్తును అంధకారం చేసే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పార్టీ గళమెత్తిందని చెప్పారు. తెలంగాణ భవన్ నుంచి 'చలో నల్లగొండ' బహిరంగ సభకు బయలుదేరే ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. నదీ జలాల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు నల్లగొం జిల్లాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు భయపడిన కాంగ్రెస్ ప్రభుత్వం తోకముడిచిందని చెప్పారు. అసెంబ్లీలో అబద్ధాలను ప్రచారం చేసిందని విమర్శించారు. కృష్ణా నదికింద ఉన్న ప్రాజెక్టులు కేఆర్‌ఎంబీకి అప్పగించడం మంచిది కాదని, దానివల్ల తెలంగాణ ఎడారిగా మారుతుందన్నారు. కరెంటుకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి రేవంత్ రెడ్డి సర్కార్‌కు కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియ చెప్పాల్సిన అవసరం తమపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తెలంగాణ ప్రజలకు నది జలాల పైన, వాటిని కేంద్రానికి అప్పజెప్పితే వచ్చే నష్టాలపై సభలో వివరిస్తారని వెల్లడించారు. తెలంగాణ నదీ జలాలపై కేంద్రం పెత్తనాన్ని ఎట్టి పరిస్థితులలో ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ఈరోజు ప్రారంభమైన జల ఉద్యమం మొదటి అడుగు మాత్రమేనని, భవిష్యత్తులో దీనిని మరింత ఉధృతం చేస్తామన్నారు.


# కనీస మద్దతు ధర చట్టం తక్షణమే అసాధ్యం

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర చట్టం తక్షణ రీతిలో తీసుకురావడం అసాధ్యం అని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. రైతుల చలోఢిల్లీ నేపథ్యంలో మంగళవారం ఆయన ఈ విషయంపై స్పందించారు. ఏదైనా కీలక విషయంపై చట్టం తీసుకురావాలంటే సంబంధిత భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు అవసరం, ఇందుకు సమయం పడుతుంది. దీనిని కాదని వెనువెంటనే ఎంఎస్‌పి చట్టం తీసుకురావడం కుదరదు కదా అని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తమ సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వంతో నిర్మాణాత్మక స్థాయి చర్చలకు దిగాలని కోరారు. రైతులు ఈ దశలో ఒక్క విషయం గుర్తుంచుకోవాలి, కొన్ని శక్తులు తమ రాజకీయ స్వీయ ప్రయోజనాలకు ఈ రైతుల నిరసనల ఘట్టాన్ని వాడుకుని, వారిని అప్రతిష్టపాలు చేయడానికి సంకల్పించాయి. ఈ విషయాన్ని రైతు ప్రతినిధులు గుర్తించాలని తెలిపారు. ఇటువంటి శక్తుల పట్ల జాగ్రత్తలు అవసరం అని హెచ్చరించారు. వారి కుట్రలను తెలుసుకోండి, అప్రమత్తంగా ఉండండని కోరారు. రైతుల ఆందోళనకు సారధ్యం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ప్రతినిధులతో చర్చలు జరిపిన కేంద్ర మంత్రుల ప్రతినిధి బృందంలో వ్యవసాయ మంత్రి కూడా ఒక్కరుగా ఉన్నారు. సోమవారం నాటి చర్చల విఫలం అయ్యాయి. అయితే ఇవి విఫలం కాలేదని, అసంపూర్తిగా నిలిచాయని మంత్రి తెలిపారు. రెండు దఫాల చర్చలలో పలు విషయాలపై అంగీకారం కుదిరిందని, అయితే కొన్ని విషయాలపై సయోధ్య లేదని మంత్రి అంగీకరించారు.



# రాజ్యసభ అభ్యర్థిగా నితీశ్ నమ్మకస్తుడు సంజయ్ ఝా

న్యూఢిల్లీ : జనతాదళ్ (యునైటెడ్ ) పార్టీ మంగళవారం రాజ్యసభ అభ్యర్థిగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు నమ్మకస్తుడైన పార్టీ ప్రధాన కార్యదర్శి సంజయ్ ఝా పేరును ప్రతిపాదించింది. బీహార్ నుంచి రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు సంజయ్ ఝా పేరును పార్టీ అధ్యక్షుడైన నితీశ్ కుమార్ ప్రతిపాదించారని జేడీ (యు) ప్రకటనలో పేర్కొంది. ఈ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. పాలక ఎన్‌డిఎ ఈ స్థానాల్లో కనీసం మూడైనా విజయం సాధిస్తాయని నమ్ముతోంది. ఎన్‌డిఎ భాగస్వామ్య బీజేపీ ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులను ప్రతిపాదించింది. మాజీ మంత్రి అయిన సంజయ్ ఝా సుదీర్ఘకాలంగా నితీశ్ కుమార్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉంటున్నారు. అలాగే బీజేపీతో కూడా మంచి సంబంధాలున్నాయి. ఝా మిథిలాంచల్ రీజియన్‌కు చెందిన వారు. రాజ్యసభ సభ్యునిగా ఇంతవరకు ఉన్న బసిష్ట నారాయణ్ సింగ్ స్థానాన్ని సంజయ్ ఝా భర్తీ చేస్తారు. నారాయణ్ సింగ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు.



### అన్నదాతను నిర్బంధించడం తప్పు :

# మోదీ సర్కార్‌పై ఆప్ ఫైర్

న్యూఢిల్లీ: రైతుల ఛలో ఢిల్లీ ప్రదర్శన సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ తీరుపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సారధ్యంలోని ఆప్ విరుచుకుపడింది. అన్నదాతలను జైల్లో నిర్బంధించడం తప్పని ఆక్షేపించింది. రైతుల ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలోని బవానా స్టేడియంను జైలుగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తోసిపుచ్చామని ఆప్ ఓ ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 13న రైతుల మార్చ్ నేపథ్యంలో నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు బవానా స్టేడియాన్ని తాత్కాలిక జైలుగా మార్చాలని కేంద్రం సోమవారం ఢిల్లీ ప్రభుత్వానికి లేఖ రాసింది. రైతుల డిమాండ్లు న్యాయమైనవని, రాజ్యాంగం ప్రకారం శాంతియుత నిరసనలు చేపట్టడం ప్రతి పౌరుడి హక్కని ఆప్ స్పష్టం చేసింది. రైతులు ఈ దేశానికి ఆహారం సమకూరుస్తారని, అన్నదాతను జైల్లో పెట్టడం తప్పని ఆప్ పేర్కొంది. ఇక పంజాబ్ నుంచి దేశ రాజధానికి రైతులు తరలివస్తుండటంతో వారిని అడ్డకునేందుకు నగరవ్యాప్తంగా వివిధ అంచెల్లో భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో పెద్దసంఖ్యలో బారికేడ్లు, ఇనుప కంచెలు, కంటెయినర్ వాల్స్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం, రైతు సంఘాల నేతల మధ్య చర్చలు అసంపూర్తిగా ముగియడంతో రైతులు 13న ఛలో ఢిల్లీ పిలుపు ఇచ్చారు.



### బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతం..!

# కాంగ్రెస్ సర్కారుకు కేసీఆర్ హెచ్చరిక

హైదరాబాద్: తెలివిలేక.. ప్రభుత్వాన్ని నడిపే చేతగాక మందిమీద బద్నాంపెట్టి బతుకుదామనుకుంటున్నారా? అట్లగాదు బిడ్డా జాగ్రత్తా..! బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతాం అంటూ అధికార కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖరావు హెచ్చరించారు. ఛలో నల్లగొండ సభలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రం వచ్చాక కరెంటు తెచ్చాం. ఏడెనిమిది నెలల్లో కరెంటు బాగు చేసి ఏడాదిన్నర నుంచి 24గంటల కరెంటు రైతాంగానికి ఇచ్చాం. మీరంతా సంతోషంగా నడింట్లో పండుకొని పంటలు పండించారు. పాములు, తేళ్లు కరువంగా బాయిలకాడికి పోలే. కేసీఆర్ గవర్నమెంట్ పోంగనే కట్కేసినట్టే బంద్ అవుతుందా కరెంటు? నేను తొమ్మిదేళ్లు ఇచ్చిన కరెంటు దానికి ఏం రోగం అయ్యింది.. మాయ రోగం వచ్చిందా? యాడపోయే కరెంటు' అంటూ మండిపడ్డారు.

**దద్దమ్మల రాజ్యమైతే గట్లనే ఉంటది..**

'దద్దమ్మల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. చాతగాని చవటల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. వాళ్లు ఉన్నంత మాత్రాన మనం నర్వస్ కావొద్దు. ఎక్కడికక్కడ మనం నిలదీయాలి. ఏమైందిరా బిడ్డ నా కరెంటు అని అడగాలి. ఇవాళ నేను ఒక మాట కుల్లకుల్లగా చెబుతున్న. మొన్నటిదాకా నడిచిన కరెంటు కాకుండా.. ఇదే మిర్యాలగూడ నియోజకవర్గంలో దామరచర్ల మండలంలో 4వేల మెగాపవర్ ప్లాంట్ కట్టినం జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో. 90శాతం పనులు పూర్తయ్యాయి. రెండుమూడు నెలలు తిప్పలుపడితే 4వేల మెగావాట్ల పవర్ వస్తుంది. రామగుండంలో ఆ నాడు మొదలుపెట్టిన ఎన్టీపీసీ 800 మెగావాట్ల పవర్ వచ్చింది. ఇంకో 800 మెగావాట్లు రాబోతున్నది. ఆ నాడు నడిపిన నాడు ఉన్నదాని కంటే 5600 మెగావాట్ల పవర్ కరెంటు ఎక్కువగ ఉండంగ కూడా.. వీళ్లకు ఏం రోగం పుట్టింది.. కరెంటు ఎందుకు ఇస్తలేరు ? ఎందుకు తిప్పలుపెడుతున్నరు ? బిడ్డా ఛలో నల్లగొండతోనే ఆపం. ఎక్కడ దొరికితే అక్కడ బజార్లలో నిలదీస్తాం' అని స్పష్టం చేశారు.



**ప్రజలను ఇబ్బందుల పెడితే బజారులో నిలబెడతాం..**

'ప్రజలను కరెంటుకు తిప్పలు పెట్టినా.. నీళ్లకు తిప్పలుపెట్టినా.. మంచినీళ్లకు తిప్పలుపెట్టినా ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలబెడుతాం. మీకు గవర్నమెంట్ ఇచ్చారు. మాకు ప్రతిపక్షం బాధ్యత ఇచ్చారు. మిమ్మల్ని నిలదీసే బాధ్యత ఇచ్చారు తప్పా.. ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలదీస్తం తప్పా.. వదిలిపెడతాం అనేదాంట్లో ఉండొద్దు. ప్రజలకు అన్యాయం చేయొద్దు. నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా.. ఏ విధంగా బీఆర్‌ఎస్ గవర్నమెంట్ ఇచ్చిందో.. ఆ విధంగా కరెంటును పునరుద్ధరించాలి. ఆవిధంగా రాష్ట్ర రైతాంగానికి కరెంటు ఇవ్వాలి. కానీ వీళ్ల యవ్వారం ఎట్లున్నది ? చరిత్రలో ఎన్నడూ లేదు. అసెంబ్లీలో జనరేటర్ పెట్టారు వీళ్ల తెలివికి. మొన్న మనోళ్లు మీటింగ్‌లో తిరుగుతుంటే.. ఒక్క మీటింగ్‌లో మాట్లాడుతుంటే ఏడుమాట్లు పోతది కరెంటు. నల్లగొండలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుంటే ఏడుసార్లు కరెంటు పోతది. ఏం మాయరోగమచ్చింది. మీకు తెలివి లేక.. నడపరాక.. చేతగాక ఇవాళ మందిమీద బద్నాం పెట్టి బతుకుదామనుకుంటున్నరా? అట్లగాదు బిడ్డా జాగ్రత్త బతుకనివ్వం. వెంటపడుతం. వేటాడుతం' అని హెచ్చరించారు.

# ఎంఎల్‌సి కవిత చొరవతో జగిత్యాల వైస్ చైర్మన్‌పై అవిశ్వాసంపై వెనక్కి తగ్గిన కౌన్సిలర్లు

హైదరాబాద్ : బిఆర్‌ఎస్ పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని ఆ పార్టీ ఎంఎల్‌సి కల్లకుంట్ల కవిత పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన జగిత్యాల కౌన్సిలర్లు మంగళవారం నాడు ఆ పార్టీ ఎంఎల్‌సి కవితతో సమావేశమయ్యారు. వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన నేపథ్యంలో స్థానిక ఎంఎల్‌ఎ సంజయ్ కుమార్, ఎంఎల్‌సి ఎల్. రమణ నేతృత్వంలో కౌన్సిలర్లు ఎంఎల్‌సి కవితతో కీలక మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత మాట్లాడుతూ, అధికార పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపై గట్టిగా పోరాటం చేయవలసిన ఈ తరుణంలో అందరూ కలిసికట్టుగా ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కాబట్టి అవిశ్వాస తీర్మానంపై పునరాలోచన చేయాలని సూచించారు. దాంతో ఎంఎల్‌సి కవిత సూచనల మేరకు అవిశ్వాస తీర్మానంపై వెనక్కి తగ్గాలని కౌన్సిలర్లు అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. బుధవారం నాడు అవిశ్వాస తీర్మానంపై జరగబోయే ఓటింగ్‌లో పాల్గొనబోమని కౌన్సిలర్లు ప్రకటించారు. పార్టీ అందరికీ అవకాశాలు ఇచ్చిందని, భవిష్యత్తులోనూ సమానావకాశాలు కల్పిస్తుందని ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత తెలిపారు. రానున్న కాలంలో పార్టీ మరింత బలోపేతమై ప్రజల ఆశీర్వాదాన్ని సంపాదిస్తుందన్న విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు.



# కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారుకు ప్రమాదం



నల్లగొండ : సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదానికి గురైంది. ఎమ్మెల్యే నందిత ప్రయాణిస్తున్న కారును నార్కట్‌పల్లి వద్ద ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఎమ్మెల్యే వెళ్తన్న కారు ముందు టైర్ ఊడిపోయింది. ఎమ్మెల్యే లాస్య తలకు స్వల్ప గాయమైంది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె సోదరి కూడా కారులోనే ఉన్నారు. నల్లగొండ బీఆర్‌ఎస్ సభ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

# పూనమ్ పాండేపై 100 కోట్లకు పరువు నష్టం కేసు

ప్రముఖ నటి, మోడల్ పూనమ్ పాండేపై పరువు నష్టం కేసు దాఖలైంది. సర్వైకల్ కాన్సర్ వంటి ఒక తీవ్రమైన వ్యాధిపై పూనమ్ పబ్లిసిటీ స్టంట్ కు పాల్పడిందని ఆరోపిస్తూ ఆమెపై 100 కోట్ల రూపాయలకు ఫైజాన్ అన్సారీ అనే వ్యక్తి పరువునష్టం దావా వేశాడు. పూనమ్ పాండే మరణించినట్లు ఈనెల 2న సోషల్ మీడియాలో న్యూస్ వైరల్ అయింది. అయితే రెండు రోజుల తర్వాత తాను బతికే ఉన్నానంటూ పూనమ్ స్వయంగా ఇన్ స్టాగ్రామ్ లో వీడియో పోస్ట్ చేసింది. సర్వైకల్ కాన్సర్ పై అవగాహన కల్పించేందుకే ఇలా చేశానని చెప్పుకొచ్చింది. ఇదంతా పూనమ్ వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి ఆడిన పబ్లిసిటీ స్టంట్ అని కొట్టిపారేసిన ఫైజాన్ అన్సారీ, ప్రజలతో ఆమె అపహాస్యం ఆడిందని విమర్శించారు. పూనమ్ తోపాటు ఆమె భర్త సామ్ బాంబేపైనా అతను కేసు పెట్టాడు.




## సంపాదకీయం

# ఇంధన రంగంలో ముందడుగు

ప్రభుత్వరంగంలోని చమురు, సహజవాయు సంస్థ (ఓఎన్‌జీసీ) కృష్ణా–గోదావరి బేసిన్‌లో తిరిగి చమురు ఉత్పత్తిని ప్రారంభించిందన్న వార్త తెలుగువారందరికీ ఎంతో ఆనందాన్ని కలిగించింది. దశాబ్దాలుగా తెలుగు వారు, భారత ప్రభుత్వం చేస్తున్న నిరీక్షణ ఫలించింది. ఓఎన్‌జీసీ తన డి–5 బ్లాక్‌లో ఉత్పత్తిని ప్రారంభించినట్టు ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. ఇది దేశానికే కాకుండా, రాష్ట్రానికి శుభవార్త. కేజీ బేసిన్‌లో చమురు ఉత్పత్తి కోసం ఎంతో కాలం స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తీరానికి 35 కిలోమీటర్ల దూరంలో రిలయెన్స్ బ్లాక్–6 పక్కనే ఈ బ్లాక్ ఉంది. సముద్ర మట్టానికి 3,000 నుంచి 3,200 మీటర్ల లోతున ఉన్న ఈ బ్లాక్ అభివృద్ధి కోసం ఓఎన్‌జీసీ ఇప్పటికే 512 కోట్ల డాలర్లను ఖర్చు చేసింది. ఈ క్షేత్రంలో 2.35 కోట్ల టన్నుల చమురు, 50.71 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు అంచనా. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ఈ వివరాలు తెలియజేస్తూ రోజుకు 45 వేల బారళ్ల చమురు,10 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. ఈ ఏడాది మే–జూన్ నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవచ్చని ఆయన వివరించారు. ఇది ఆచరణలోకి వస్తే చమురు, గ్యాస్ రంగంలో మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలు చాలా మటుకు పరిష్కారం అవుతాయి. మన దేశంలో వినియోగం అయ్యే పెట్రోలియం ఉత్పత్తుల్లో 80 శాతం విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలపై వీటి కోసం ఆధారపడటం వల్ల ఆ దేశాల్లో ఘర్షణలు, యుద్ధాలు అనివార్యమైనప్పుడు చమురు, సహజ వాయువుల ధరలు ఆకాశాన్ని అంటడం సహజంగా జరుగుతోంది. చమురు ఎగుమతులను రాజకీయ అస్త్రంగా అగ్ర, సంపన్న దేశాలు వినియోగించుకుంటున్నాయి. దీనివల్ల వర్ధమాన దేశాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. కేజీ బేసిన్‌లో సహజవాయువు ఉత్పత్తి ప్రారంభమైతే అదనంగా 7 శాతం గ్యాస్ నిల్వలు జమ అవుతాయి. కేజీ బేసిన్‌లో చమురు, గ్యాస్ ఉత్పత్తి ఇంధనరంగంలో గొప్ప ముందడుగు అని ప్రధాని నరేంద్రమోడీ అభివర్ణించారు. సహజ వనరులకు మన దేశం పెట్టింది పేరు. వాటిని వినియోగించుకుని వీలైనంత వరకు దిగుమతులను తగ్గించుకోవాలన్న పిలుపును ఆయన అధికారంలోకి రాగానే ఇచ్చారు. అందుకు అనుగుణంగానే విదేశీ పరిజ్ఞానంతో మన దేశంలోనే రక్షణ రంగ సామగ్రిని, ఇతర సాంకేతిక ఉపకరణాలను తయారు చేసుకోవడానికి మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని ఇచ్చారు. ఇది చాలా వరకూ ప్రతిఫలించింది. ఓఎన్‌జీసీలో క్లస్టర్–2లో ఉత్పత్తులు 2021లోనే ప్రారంభం కావల్సి ఉండగా, కోవిడ్ కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. సముద్ర గర్భం నుంచి చమురును వెలికి తీసేందుకు ఆర్మ్‌డ్ స్టెర్లింగ్ –వీ అనే కదలాడే నౌకను ఓఎన్‌జీసీ తీసుకుని వచ్చింది. అది షాపూర్‌జీ–పల్లోంజీ ఆయిల్ కంపెనీకి చెందినది. రిలయెన్స్ కేజీ–డీ–6 బ్లాకు పక్కనే ఓఎన్‌జీసీ కంపెనీకి చెందిన డీ డబ్ల్యూన్ 98బై –2బ్లాక్ ఉంది. వీటి పక్కనే ఇంకా చమురు బావులు ఉన్నట్టు గుర్తించారు. వీటిని మూడు క్లస్టర్లుగా విభజించారు. ఇళ్ళల్లో ఇంధన ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. వాహనాలకు వంటగ్యాస్‌ని ఇప్పటికే వినియోగిస్తున్నారు. దేశీయ పరిశ్రమల్లో గ్యాస్ వినియోగం పెరుగుతుంది. గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు మరిన్ని ప్రారంభం కావచ్చు. మనదేశంలో ఇప్పటికే బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు కూడా పెరిగితే విద్యుత్‌కి లోటు ఉండదు. సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ఓఎన్‌జీసీలో పెట్టుబడులు పెరిగాయి. రిలయెన్స్ ఇండస్ట్రీస్ కూడా ఈ రంగంలో ప్రవేశించి ఉత్పత్తులనుతృతీయ ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న కృషి కి ఈ ఇంధన వనరులు ఎంతో దోహదం చేస్తాయి. విదేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవడం వల్ల కరెంట్ ఖాతా లోటు పెరిగిపోతోంది. ఏటా వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని వ్యయపర్చాల్సి వస్తోంది. స్వదేశంలో ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. అంతేకాక, ఓఎన్‌జీసీ బావులు, ఇతర కార్యాలయాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రాజమహేంద్రవరంలో మోరంపూడి రోడ్డులో ఓఎన్‌జిసీ కార్యాలయాలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. గ్యాస్ నిక్షేపాలు పెరగడం వల్ల ఇంధన వనరులకోసం మన దేశం దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. వంట గ్యాస్, సహజ వాయువు ఉత్పత్తి పెరిగితే, ఇళ్ళల్లో ఇంధన ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. వాహనాలకు వంటగ్యాస్‌ని ఇప్పటికే వినియోగిస్తున్నారు. దేశీయ పరిశ్రమల్లో గ్యాస్ వినియోగం పెరుగుతుంది. గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు మరిన్ని ప్రారంభం కావచ్చు. మనదేశంలో ఇప్పటికే బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి.

# పత్తాలేని ప్రజాస్వామ్య నైతికత....!





మీరు, ఈ సంపాదకీయ పుటలోని వ్యాసంపై దృష్టి పెట్టే ముందే, మొదటి పేజీలో పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలపై వార్త చదివే వుంటారు. పాకిస్థాన్‌లో ఎన్నికలా!? రాజకీయ పరిశీలకులతో పాటు పాక్ ఓటర్లలో అత్యధికులు సైతం ఆ ప్రక్రియను ఒక 'ఎంపిక'గా మాత్రమేగానీ, ఒక 'ఎన్నిక'గా చూడడం లేదన్నది ఒక నిష్ఠుర సత్యం. పాకిస్థాన్‌లో ప్రజాస్వామిక మాంద్యానికి కారణమేమిటో మరి చెప్పనవసరం లేదు. ఆ దేశ సర్వం సర్వాధిపత్య సైన్యం ఒక పద్ధతి ప్రకారం తమ వ్యవస్థలోని సమస్త స్థాపరమైన నిరోధక సమతౌల్యాల (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్)ను ఒక పద్ధతి ప్రకారం నిర్మూలించింది. పాకిస్థాన్‌కు భిన్నంగా భారతీయ ప్రజాస్వామ్యం ఇప్పటికీ సుదృఢంగా ఉన్నది. అయితే మన వ్యవస్థ అంతా సజావుగా, సక్రమంగా ఉందని భావించడం తొందరపాటే అవుతుంది. 'మ్యాచ్ ఫిక్సింగ్' (లాలూచీ క్రీడ) అనేది భారత ఉపఖండపు అంటువ్యాధి కాదూ? కనుక దేనినైనా వెన్వెంటనే విశ్వసించకుండా సంశయాత్మక వైఖరితో వివేచించడం ఆరోగ్యకరం. చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ఆ వాస్తవాన్ని మరోసారి నొక్కి చెప్పింది. ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మేయర్ ఎన్నిక పెద్దగా ప్రాముఖ్యం లేని వ్యవహారమే. ఉపేక్షణీయమైనది. అయితే చండీగఢ్ మేయర్ పదవికి తాజాగా జరిగిన ఎన్నిక మరో విధంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. అవును, ప్రస్తావిత మేయర్ ఎన్నిక భారత ప్రజాస్వామ్య దౌర్బల్యాలను బహిర్గతపరిచింది. ఎంతగా అంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. పోలింగ్ ప్రక్రియను నిర్వహించిన రిటర్నింగ్ అధికారి అవకతవకలకు పాల్పడడం నియమ నిబంధనలను కెమెరా సాక్షిగా ఉల్లంఘించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అతడి చర్యలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే కాదు, హత్య చేయడమేనని సుప్రీంకోర్టు ఆగ్రహించింది. సదరు రిటర్నింగ్ అధికారిని కఠినంగా శిక్షించాలని ఖండితంగా పేర్కొంది. ఇప్పటికివి న్యాయపరమైన వ్యాఖ్యలే కావచ్చుగానీ, అయితే చండీగఢ్‌లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారిని ఎట్టి పరిస్థితులలోనూ శిక్షించి తీరాల్సిందేనన్న విషయమై సుప్రీంకోర్టు దృఢ సంకల్పంతో ఉన్నది. అత్యున్నత న్యాయవ్యవస్థ తీవ్ర ఆగ్రహం సమర్థనీయమైనదే, సందేహం లేదు. అయితే ఇబ్బంది కలిగించే ప్రశ్న ఒకటి ఉన్నది: మేయర్ ఎన్నికలోనే అవకతవకలు అంతగా జరిగితే అంతకంటే కీలక ప్రాధాన్యమున్న (అసెంబ్లీ లేదా పార్లమెంటు) ఎన్నికలలో అటువంటి అక్రమాలు చోటుచేసుకుంటే సంభవించేది ఏమిటి? మన ప్రజాస్వామ్యం ఏమైపోను? చండీగఢ్ మేయర్ ఎన్నిక ఈ ఏడాది జనవరి 18నే జరగవలసి ఉండగా చివరిక్షణంలో వాయిదా వేశారు. రిటర్నింగ్ అధికారిగా నియమితుడైన వ్యక్తి హఠాత్తుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిపాలు కావడం వల్లే ఎన్నికను వాయిదా వేయడం అనివార్యమయింది. అయితే న్యాయస్థానం జోక్యంతో ఆ ఎన్నికను సత్వరమే నిర్వహించక తప్పలేదు. కానీ నిర్వహించిన తీరుతెన్నులు అనేక అనుమానాలకు తావిచ్చేవిగా ఉన్నాయి. ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి చిత్రంగా రద్దు చేశారు. అవన్నీ ఆమ్ ఆద్మీ పార్టీ – కాంగ్రెస్ కూటమికి చెందినవే. ఆ రద్దయిన ఓట్ల బ్యాలెట్ పత్రాలను పరిశీలించేందుకు పోలింగ్ ఏజెంట్లకు అనుమతి నివ్వలేదు. ఈ అల్ల కల్లోలంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొత్త మేయర్‌గా ఎన్నికైనట్టు ఏకపక్షంగా ప్రకటించడం జరిగింది. ఆ ప్రకటన చేసిన రిటర్నింగ్ అధికారి అనీల్ మాసి బీజేపీ మైనారిటీ మోర్చా సభ్యుడు, మునిసిపల్ కార్పొరేషన్ నామినేటెడ్ కౌన్సిలర్ కావడంతో మేయర్ ఎన్నికలో అతడి పాత్ర మరింతగా అనుమానాస్పదమయింది. చండీగఢ్ మేయర్ ఎన్నికను స్థానిక పాలనా సంస్థల సంకుచితత్వ రాజకీయాలకు మరొక తార్కాణంగా కొట్టివేయవచ్చు. అయితే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భాగస్వాములుగా ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలసికట్టుగా మొట్టమొదటిసారి బీజేపీని సవాల్ చేస్తూ ముందుకు రావడంతో ఆ మేయర్ ఎన్నిక ఎనలేని ప్రాధాన్యం సంతరించుకున్నది. ఆరంభ దశలో ఉన్న 'ఇండియా' కూటమి తన సంఖ్యాబలం ప్రత్యర్థి ప్రాబల్యాన్ని తీవ్రంగా సవాల్ చేయగలదని 'ఇండియా' కూటమి ప్రప్రథమంగా రుజువు చేసింది. కాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'ఇండియా' కూటమి ఐక్యతను, మనోస్థైర్యాన్ని మరింతగా దెబ్బ తీసేందుకు చండీగఢ్ మేయర్ ఎన్నిక బీజేపీకి ఒక అవకాశాన్ని కల్పించింది. ఈ కారణంగానే చండీగఢ్ మేయర్ ఎన్నిక పర్యవసానాలు భావి రాజకీయాలకు సూచనలుగా ఉన్నాయి. ఒక విధంగా అవి అమంగళకరంగా ఉన్నాయని చెప్పక తప్పదు. ప్రతిపక్షానికి స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఆప్%--%కాంగ్రెస్‌కు 20 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా, బీజేపీకి 16 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నది. అయినప్పటికీ ఆ మేయర్ పదవి 'తస్కరణ'కు గురయింది. అయినప్పుడు భావి ఎన్నికల పోరాటాలలో ఇటువంటి పరిణామాలు సంభవించవనేందుకు భరోసా ఏమిటి? మరింత ముఖ్యమైన విషయమేమిటంటే రిటర్నింగ్ అధికారి కపట ప్రవర్తన, రాజ్యాంగ అధికారులు, ప్రజాస్వామిక సంస్థలూ అంతకంతకూ నిరంతర నిఘాకు గురవుతున్న తీరుతెన్నులకు అనుగుణంగా ఉన్నది. గవర్నర్ల పాత్రను %--% జార?ండ్ గవర్నర్ ఇందుకొక తాజా ఉదాహరణ%--% పాలకులు అంతకంతకూ తమ తీవ్ర పక్షపాత దృక్పథం నుంచి చూస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కానివ్వండి లేదా సీబీఐ కానివ్వండి, చట్టాలను అమలుపరిచే సమస్త అధికార యంత్రాంగమూ అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి అనుకూలత, విధేయతతో వ్యవహరించడం మామూలు విషయమయిపోయింది. చివరకు ఎన్నికల సంఘం తటస్థతను కూడా ప్రశ్నించడం జరుగుతోంది! కార్యనిర్వాహక వర్గం అధికారాల దుర్వినియోగంలో భాగంగానే ఈ పరిణామాలు సంభవిస్తున్నాయనే వాదన ఒకటి గట్టిగా ఉన్నది. అందులో నిజం లేకపోలేదు. అయితే ఇవి కేవలం 2014లో మాత్రమే ప్రారంభం కాలేదు. దశాబ్దాలుగా మన అధికార రాజకీయాలలో అవి చాలా సహజంగా, తరచు చోటుచేసుకుంటున్నాయనేది ఎవరూ కాదనలేని సత్యం. ఇందిరాగాంధీ ఒక అర్ధరాత్రి అత్యవసర పరిస్థితిని ప్రకటించి తన ప్రత్యర్థులు అందరినీ అరెస్ట్ చేయలేదా? రికార్డు స్థాయిలో రాష్ట్రాలలో 50 సార్లు కేంద్ర పాలన విధించిన ఘన చరిత్ర కూడా ఆమెదే కాదూ? ఆమె తనయుడు రాజీవ్‌గాంధీ పరువు నష్టం బిల్లు తీసుకువచ్చి పత్రికా స్వాతంత్ర్యానికి భంగం కలిగించలేదూ? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన మంత్రులు తరచూ విమర్శిస్తుండే జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలను నిష్ఠగా పాటించిన నేతగా ప్రసిద్ధుడు. మరి ఆయన సైతం రాజ్యాంగానికి మొదటి సవరణతో వాక్ స్వాతంత్ర్యానికి అవరోధాలు కల్పించారు. కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. అందరికీ 'మంచిరోజులు' తీసుకువస్తామనే హామీతో నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చింది. బీజేపీ భిన్నమైన పార్టీ అని, కాంగ్రెస్‌కు భిన్నమైన పాలనా సరళిని అనుసరించి ప్రజలకు శ్రేయస్సు సమకూరుస్తుందని నొక్కి చెప్పారు. అత్యవసర పరిస్థితి, చీకటి రోజుల్లో జైలువాసం గడిపిన బీజేపీ నాయకులకు తమ సొంత ప్రభుత్వ హయాంలో కళంకిత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళించే అవకాశం లభించింది. మరి వారు ఆ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించారా? మోదీ పదేళ్ల పాలనలో విపక్ష నేతలను భయభీతులకు గురిచేసి లేదా ప్రలోభాలతో కనీసం నాలుగు ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చి వేశారు. మరో రెండు విపక్ష ప్రభుత్వాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎన్నికలలో ప్రజలు ఇవ్వని మెజారిటీలను తమ 'సొంత' పద్ధతులలో సాధించుకున్నారు. ఈడీ, సీబీఐ మొదలైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎంత చురుగ్గా ఉంటున్నాయో, బీజేపీ పాలిత రాష్ట్రాలలో అంత మందకొడిగా వ్యవహరిస్తున్నాయి. ఇక ప్రలోభాల గురించి చెప్పనవసరం లేదు.

# ఈ సంతోష సందర్భాన...

మాన్యశ్రీ పి.వి నరసింహారావు గారికి భారత రత్న ప్రకటించడం ఎంతో హర్షదాయకం. ఎన్నడో రావలసిన 'భారత రత్న" పురస్కారం ఎన్నెన్నో కారణాల వల్ల రాకపోయినా చిట్టచివరికి ఈ రోజు (9/2/2024) ప్రకటితం కావడం ఆయన కుటుంబ సభ్యులకు, అశేష అభిమానులకు అత్యంత ఆనందదాయకమైన విషయం. ఈ ఆనందపు ఘడియల్లో ఆయనకు కొందరు కావాలని ఆపాదించిన అపకీర్తి అంతా పటాపంచలైపోయింది. పి.వి. గారిది స్వచ్ఛమైన మనసు. నటనలు, అబద్ధాలు తెలియని మనిషి. కీర్తి కోసం పాకులాడే మనిషి కాదు. నిక్కమైన, నిఖార్సయిన సెక్యులర్. ఆయన నెహ్రూ గారికి వీరాభిమాని. అయినా కొందరు ఈర్ష్యాపరులు పనిగట్టుకొని ఆయనను కళంకితుణ్ణి చేశారు. ఆలస్యమైనా సత్యమే గెలిచిందని సంబరపడుతున్నాను అందరి అభిమానులతో పాటు. శ్రీ పి.వి. నరసింహారావు గారి వివాదతీత విశిష్ట వ్యక్తిత్వం, అపారమైన పరిపాలనానుభవం, మూర్తీభవించిన సౌజన్యం, శేఖరీభూతమైన శేముషీ వైదగ్ధం, అసాధారణ వైదుష్యం, నిష్కళంక రాజకీయ చరితం, నిస్వార్థనిరతి, నిశ్చలమైన నిద్దపు నిజాయతి, నిర్మలమైన నిరాడంబరత, చెక్కుచెదరని చిత్తశుద్ధి మొదలైన విశిష్ట గుణాలే ఇక్కడ ముఖ్యమంతి పదవిని, అక్కడ ప్రధాన మంత్రి పదవిని తెచ్చి పెట్టాయనేది యథార్థం. ఇటు తెలుగు తల్లికి, అటు భారత మాతకు సేవజేసిన సేవధి, భాగ్యశాలి. సమర్థుడైన సచివుడిగా, సహృదయుడిగా, సచ్ఛీలుడిగా, సత్పురుషుడిగా, సౌమ్యుడిగా, సాహితీవేత్తగా, అసాధారణ ప్రజ్ఞాధునిగా, అసదృశ విజ్ఞానఖనిగా, మేధావిగా, బహుభాషా కోవిదుడిగా, రాజనీతి దురంధరుడిగా, విద్యావేత్తగా, వినయమూర్ధన్యుడిగా, వివేక చూడామణిగా, ఉత్తమవాఙ్మగా, అమితశ్రద్ధాళువుగా, సమయస్ఫూర్తి, ఔచిత్యమూ ఎరిగిన సరస సంభాషణ చతురుడిగా, స్థితప్రజ్ఞుడిగా సర్వుల ప్రశంసలందుకున్న సహస్ర ప్రతిభాసాకారుడు. పి.వి. గారు తాను తలపెట్టిన ఆర్థిక సంస్కరణలు సంపూర్ణంగా విజయవంతం కావాలని, అధోగతిలో వున్న దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని ఎంతో చిత్తశుద్ధితో కోరుకున్నాడు. అందుకు దేశంలో శాంతి భద్రతలకు ఏ మాత్రం విఘాతం కలగకూడదని, ఎంతో జాగరూకతతో వ్యవహరించాడు. ఒకవైపు పంజాబ్‌లో వేర్పాటువాదం జడలు విప్పినా, కశ్మీర్‌లో ఉగ్రవాదులు చెలరేగుతున్నా వాటిన్నిటినీ సమయస్ఫూర్తితో, సంకల్పశుద్ధితో చక్కదిద్దిన రాజనీతిజ్ఞుడు. ఆయన ఎంతో చిత్తశుద్ధితో బాబ్రీమసీదు చెక్కు చెదరకుండా వుండాలని, దాని పక్కనే మందిర నిర్మాణం జరగాలని ఎంతోగానో కోరుకున్నాడు. ఆ రకంగా సాధువులను, మహంతులను, రాజకీయ నాయకులను ఒప్పించుకున్నాడు. బాబ్రీమసీదు కూల్చివేతకు గురి అయినా, బాబ్రీ మసీదు పునర్నిర్మాణం జరగాలని, పక్కనే రామ మందిర నిర్మాణం జరగాలని కోరుకొని ఆ దిశగా అడుగులు వేసినప్పటికీ కాలం మరో విధంగా తీర్పు చెప్పింది.

ఏమైనా ఈ విషయంలో ఆయన చిత్తశుద్ధిని ఏమాత్రం శంకించరానిది. ఆయన ఆంగ్లంలో రాసిన 'అయోధ్య డిసెంబర్ 6, 1992' అనే పుస్తకం చదివితే నిజమేదో, ఆయన ఆంతర్యమేమిటో అవగతమవుతుంది. ఏమైనా ఆయన మరణ కాలంలో ఎంతో వేదనకు గురి అయ్యారు. ఆయన పార్థివ దేహం కూడా కనీస మర్యాదలు నోచుకోలేకపోయింది. అదంతా ఒక పీడకలు.

పి.వి నరసింహారావు సెక్యులర్‌గా తన జీవితాన్ని, అధికారాన్ని గడిపాడనడానికి ఒక దృష్టాంతం ఈ సందర్భంగా చెప్పాల్సి వస్తుంది. ప్రధానిగా ఆయన నేపాల్ పర్యటనకు వెళ్ళినపుడు ఉభయ దేశాలకు సంబంధించిన అనేక అంశాల విషయంలో ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత చివర సీతాదేవి జన్మస్థలమైన జనక్‌పూర్ (మిథిల)లో ఒక ధర్మశాలను భారత దేశం కట్టించాలని అప్పటి నేపాల్ ప్రధాన మంత్రి గిరిజా ప్రసాద్ కొయిరాల కోరారు. కాని భారత దేశం మతాతీత లౌకిక రాజ్యాంగానికి కట్టుబడి వుంది. కనుక ప్రభుత్వపరంగా కాక, తన వెంట వచ్చిన మీడియా సలహాదారు పి.ఎ.ఆర్.కె ప్రసాద్ గారు లోగడ తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి) నేపాల్ ప్రభుత్వాధినేత కోరిన విధంగా తన నిధులతో ధర్మశాలను నిర్మించింది. పి.వి తన వ్యక్తిగత విశ్వాసాల కోసం ప్రభుత్వ హోదాను దుర్వినియోగం చేయకూడదని ప్రభుత్వపరంగా ఒక మతానికి సంబంధించిన విషయాల్లో నేరుగా జోక్యం చేసుకోవడం సరికాదనే విశ్వాసానికి కట్టుబడి జీవించిన వ్యక్తి. అటువంటి సచ్ఛీలుడికి అపకీర్తి ఆపాదించడం ఉద్దేశపూర్వకంగా చేసినదే తప్ప మరేమీ కాదు.ఇన్నేళ్ళ తర్వాత ఆయనకు రావలసిన 'భారత రత్న' రావడంతో అందరూ గతాన్ని మరిచిపోయి, పార్టీలకతీతంగా, సంకుచిత భావాలను, రాగద్వేషాలను విడనాడి, ఏ ఒక్కరూ దుర్వ్యాఖ్యానాలు, దుర్భాషలు చేయకుండా ఆయన నిక్కమైన నిర్మల చరితను స్మరించుకోవడమే ఆయనకు అర్పించే నిక్కమైన నివాళి సార్థకమవుతుంది. ఆయన నిష్కళంక రాజకీయ చరిత్ర మీద మరింత లోతైన పరిశోధనలు జరిగి సత్యాన్వేషణ జరగాలని ఆయన జీవిత చరిత్రకారుడిగా నిండు మనస్సుతో కోరుకుంటున్నాను.



# మీతోనే అరబ్ భారత్ బంధం మరింత విశిష్టం



అబూధాబి : అరబ్ దేశాలలో భారతీయ సంతతి కీలక పాత్ర భారతదేశానికి గర్వకారణం అని ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. యుఎఇ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ మంగళవారం 'అహ్లాన్ మోడీ' పేరిట ఏర్పాటు అయిన ఇష్టాగోష్టిలో ముచ్చటించారు. అరబీ భాషలో అహ్లాన్ మోడీ అంటే హలో మోడీ అనే పలకరింపు. ఈ ఆత్మీయసమ్మేళన సభకు వేలాది మంది భారతీయ సంతతి వారు కుటుంబాలతో తరలివచ్చారు. యుఎఇ భారత్ స్నేహసంబంధాలను మరింతగా కీర్తించుకుంటూ ముందుకు సాగాల్సిన సమయం ఇదేనని, ఇక్కడి భారతీయ సంతతి దేశానికి గర్వకారణం అని అభినందించారు. స్థానిక జాయెద్ స్పోర్ట్ సిటి స్టేడియంలో కార్యక్రమం జరిగింది. మోడీ రాగానే సభికులు పెద్ద ఎత్తున నమస్కార్, మోడీ మోడీ నినాదాలకు దిగారు. తన పట్ల ఇక్కడి తనవారు చూపిన భావోద్వేగం తనను కదిలించివేసిందని మోడీ చెప్పారు. ఇంత మంది ఇక్కడికి తరలివచ్చారు. ఆనందంగా ఉంది. ఇక్కడికి యుఎఇలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో భారతదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. అయితే వీరందరి గుండెస్పందన అనుసంధానం ఒక్కటే అని మోడీ స్పందించారు. ఇదో చారిత్రక స్టేడియం, ఇక్కడ ఇరుదేశాల నడుమ బలోపేత బంధం గురించి ఇప్పుడు ఇంతమంది నడుమ మరోసారి వెనోళ్ల ప్రకటించుకోవల్సి ఉందన్నారు. ఉభయదేశాల జాతీయ గీతాలాపనలతో ఈ కార్యక్రమం ఆరంభమైంది. ఇక్కడి ప్రతి వ్యక్తి గుండెస్పందన లయాన్వితంగా పలికేది ఒక్కటే భారత్ యుఎఇ స్నేహం విలసిల్లాలి అనేదే అని తెలిపారు.

తాను ఇక్కడి ఇంతమంది భారతీయులతో కలిసినప్పుడు తన కుటుంబ సభ్యుల వద్దకు వచ్చినంత ఆనందంగా ఉందని, 140 కోట్ల మంది భారతీయుల తరఫున సోదరసోదరీల దూతగా తాను ఇక్కడికి వచ్చినట్లు, వారి సందేశం ఇక్కడి సంతతివారికి అందిస్తున్నట్లు తెలిపారు. గడిచిన పదిసంవత్సరాలలో తాను యుఎఇ పర్యటనకు రావడం ఇది ఏడోసారి అని వివరించారు.

# అంజీర్ ఆకులతో ఆరోగ్య ప్రయోజనాలు.....

అంజీర్ ఆకులతో కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు అంజీర్ ఆకులు ఆరోగ్యానికి చాలా మంచివి. వీటివల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం. గుండె జబ్బులతో బాధపడే వారికి కూడా అంజీర్ ఆకులను తీసుకోవడం మేలు చేస్తుంది. అంజీర్ ఆకులలో ఒమేగా -3, ఒమేగా -6 ఉన్నాయి, ఇవి గుండెను బలోపేతం చేస్తాయి. కాబట్టి గుండెను దృఢంగా చేసేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా శరీరంలో కొలెస్ట్రాల్ పరిమాణాలు కూడా నియంత్రణలో ఉంటాయి. ఆ ఆకులలో మంచి మొత్తంలో పొటాషియం, కాల్షియం ఉంటాయి. ఇవి ఎముకల ఎముకల సాంద్రతను బలపరుస్తాయి. దీన్ని తీసుకోవడం వల్ల ఎముకల్లో నొప్పి సమస్య నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. అంతే కాదు, అంజీర్ ఆకులలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది శరీరం నుండి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది.ఎముకలు బలహీనంగా ఉంటే అంజీర్ ఆకులను తీసుకోవడం వల్ల ప్రయోజనం పొందవచ్చు.

ఈ ఆకులతో తయారు చేసిన పొడిని తీసుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, కాల్షియం లభించి చాలా ఎముకలు దృఢంగా మారుతాయి. ఇందుకోసం అంజీర్ ఆకుల పొడిని ఉపయోగించాలి. అంజీర్ ఆకులను ఎండబెట్టి పొడి చేసుకోవచ్చు. అర చెంచా పొడిని ఒక కప్పు నీళ్లలో కలిపి టీ లాగా తాగాలి. రెండు విధానాలు అపారమైన ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.5 అంజూర ఆకులను నీటిలో వేసి 10 నిమిషాలు మరిగించాలి. ఆ తర్వాత ఆ నీటిని టీగా తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.ఈ ఆకులతో అద్భుతమైన యాంటీ డయాబెటిక్ లక్షణాలు లభిస్తాయి. అంజీర్ ఆకులను తాజాగా లేదా ఎండబెట్టి తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్నాయి.కాబట్టి ఖచ్చితంగా ఈ ఆకులని ఉపయోగించుకోండి. ఖచ్చితంగా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలని సులభంగా పొందుతారు. నిత్యం ఎంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కాబట్టి ఖచ్చితంగా ఈ ఆకులని ఉపయోగించుకోండి.



# ఒక్క లవంగంతో సంపూర్ణ ఆరోగ్యం...




మనం వంటల్లో వాడే లవంగం రుచిని పెంచడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. లవంగం తీసుకోవడం వల్ల కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.లవంగాలను రోజు ఒక్కటి తినడం వల్ల లేదా వీటిని వంటల్లో వాడడం వల్ల లేదా లవంగాలతో టీని తయారు చేసి తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటామని నిపుణులు చెబుతున్నారు.కొవ్వు కణాల్లో వచ్చే ఇన్ ఫ్లామేషన్ ను తగ్గించడంలో లవంగాలు ఎంతో చక్కగా పనిచేస్తాయని నిపుణులు పరిశోధనల ద్వారా వెల్లడించారు. ఎక్కువకాలం పాటు శరీరంలో కొవ్వు పేరుకుపోయిన వారు లవంగాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.లవంగాల్లో ఎన్నో ఔషధ గుణాలు, ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. లవంగాలను తీసుకోవడం వల్ల మనం ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. లవంగాల్లో యూజనాల్ అనే రసాయన సమ్మేళనం ఉంటుంది. 100 గ్రాముల లవంగాల్లో 14 గ్రాముల యూజనాల్ ఉంటుంది. అలాగే వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కొవ్వు కణాల్లో వచ్చే ఇన్ ఫ్లామేషన్ న తగ్గించడంలో, సైటోకైన్స్ ను, ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో సహాయపడతాయి.కొవ్వు కణాల్లో ఇన్ ఫ్లామేషన్ రావడం వల్ల క్రమంగా ఇది క్యాన్సర్ కు దారి తీస్తుంది. అలాగే ఆటో ఇమ్యునో జబ్బులు వచ్చే అవకాశం ఉంది. వీటితో అనేక ఇతర అనారోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.ఇలా అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడడంలో లవంగాలు చక్కగా పనికి వస్తాయని నిపుణులు చెబుతున్నారు.అలాగే లవంగం తింటే కడుపులో ఉన్న బాక్టీరియా కూడా ఈజీగా చచ్చిపోతుంది. కాబట్టి ప్రతి రోజు కూడా లవంగంని తప్పకుండా మీరు తినే ఆహారంలో భాగం చేసుకోండి. ఖచ్చితంగా మీకు ఎలాంటి రోగాలు రాకుండా ఎల్లప్పుడూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు.

# చికెన్ లివర్‌ని వదిలేస్తున్నారా?



పూర్వకాలంలో అయితే ఏ పండగో ఏ పబ్బము వచ్చినప్పుడు మాత్రమే మాంసం తినేవారు.కానీ ఈ మధ్యకాలంలో చికెన్ ఇష్టపడని వారంటూ ఉండరు. ఇంకా చెప్పాలి అంటే చాలామందికి ముక్క లేనిదే ముద్ద దిగదు.కానీ కొంతమంది చికెన్ బ్రెస్ట్ పీస్ తిన్నట్టు,చికెన్ లివర్ ని మాత్రం అంతగా ఇష్టపడరు.కానీ చికెన్ బ్రెస్ట్ పీస్ తినడం కన్నా,చికెన్ లివర్ తినడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని చెబుతున్నారు ఆహార నిపుణులు.దీనిలో ఉన్న ప్రయోజనాల గురించి తెలిస్తే కచ్చితంగా ఈసారి లివర్ తెచ్చుకొని మరీ తింటారు. మరి అవి ఏంటో చూద్దామా.. చికెన్ లివర్‌లో ఐరన్ పుష్కలంగా లభిస్తుంది.ఐరన్ అనేది మన శరీరాలు ఆక్సిజనేటెడ్‌గా ఉండటానికి సహాయపడేందుకు ముఖ్యమైనది.ఇది రక్తహీనతతో బాధపడేవారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. మరి ముఖ్యంగా గర్భం దాల్చిన వారికి తగిన మోతాదులో లివర్ ఇవ్వడం వల్ల వారి ఫోలిక్ యాసిడ్ పెరిగి, రక్తహీనత తగ్గుముఖం పడుతుంది. చికెన్ బ్రెస్ట్ పీస్ తో చికెన్ లివర్ ని కంపేర్ చేసినప్పుడు చికెన్ లివర్ లో తక్కువ క్యాలరీలు ఉంటాయి.మరియు అధిక ప్రోటీన్ ఉంటుంది.దీనితో తొందరగా పొట్ట నిండిన భావన కలిగి తక్కువ తింటారు.దీనిని తరచూ తీసుకోవడం వల్ల అధిక బరువు సమస్యను అదుపులో ఉంచుకోవచ్చు.అంతేకాక ఇందులో యాంటీవైరల్,యాంటీ ఇన్ఫ్లమేటరీ అమైనో యాసిడ్ లైసిన్‌లో పుష్కలంగా లభిస్తాయి. దీనితో పాటు చికెన్ లివర్‌లో కొన్ని బి విటమిన్లు లభించి గర్భిణీలు,తల్లులు, పెరుగుతున్న పిల్లలలో ప్రో-మెటబాలిక్ శక్తి యొక్క అదనపు బూస్ట్ అవసరమయ్యే ఎవరికైనా ఇది సహాయకరంగా ఉంటుంది. దంత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకుంటే, చికెన్ కాలేయాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. 3.5 ఔన్సుల చికెన్ కాలేయంలో 12 మైక్రోగ్రాముల K2 లభిస్తుంది.మరియు విటమిన్ సి,ఎ పుష్కలంగా దొరుకుతాయి.దీనిని తరుచూ తీసుకోవడంతో రోగనిరోధక శక్తిని పెరుగుతుంది.కళ్ళు, చర్మం, జుట్టు మరియు గోళ్ళ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో విటమిన్ ఏ అద్భుతంగా పనిచేస్తుంది.


# క్యాన్సర్ రాకుండా ఈ జాగ్రత్తలు




క్యాన్సర్ రాకుండా ఈ జాగ్రత్తలు ఖచ్చితంగా తీసుకోండి? క్యాన్సర్ ఎంత ప్రమాదకరమైన రోగమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది ఒక్కసారి వచ్చిందంటే పూర్తిగా తగ్గడం అంత సులభమైన విషయం కాదు. అయితే తీసుకునే ఆహారం విషయంలో మొదటి నుంచి జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ బారిన పడకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఎలాంటి వాటికి దూరంగా ఉంటే క్యాన్సర్ దరిచేరదో ఇప్పుడు మనం తెలుసుకుందాం. అతిగా మద్యం తాగడం కూడా క్యాన్సర్‌కు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రొమ్ము, అన్నవాహిక, ప్యాంక్రియాటిక్, కాలేయ క్యాన్సర్ వంటివి వచ్చే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆల్కహాల్ మెటబాలిజం సమయంలో ఎసిటాల్డిహైడ్ అనే క్యాన్సర్ కారకం ఉత్పత్తి అవుతుంది.అలాగే వేయించిన కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రత వద్ద వండిన ఆహారం, అదనపు నూనె వాడకం ఆరోగ్యానికి మంచిది కాదు. అలాగే ఇది క్యాన్సర్ రిస్క్ తో ముడిపడి ఉంటుంది. ఇలాంటి ఆహార పదార్థాలతో స్టార్చ్, ఆక్సిడైజ్డ్ పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.అలాగే చక్కెర ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలకు, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటివి ఎక్కువగా తీసుకున్న వారిలో రొమ్ము, కడుపు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చక్కెర అధికంగా ఉండే ఆహార పదార్థాలను తినడం వల్ల ఊబకాయం పెరుగుతుంది, ఇన్సులిన్ స్థాయిలు తగ్గుతాయి. ఇవి కొన్ని క్యాన్సర్‌లకు ప్రమాద కారకాలుగా చెబుతున్నారు.ప్రాసెస్ చేసిన మాంసానికి దూరంగా ఉండాలి. ప్రాసెస్ ఫుడ్ తీసుకుంటే కడుపు క్యాన్సర్ ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రాసెస్ ఫుడ్‌లో నైట్రేట్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఫుడ్ తీసుకుంటే కడుపులో జీర్ణక్రియ సమయంలో నైట్రోసమైన్‌ను ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి ఇలాంటి ఆహారాన్ని తక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. ఇలాంటివి ఎక్కువగా తీసుకున్న వారిలో రొమ్ము, కడుపు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చక్కెర అధికంగా ఉండే ఆహార పదార్థాలను తినడం వల్ల ఊబకాయం పెరుగుతుంది, ఇన్సులిన్ స్థాయిలు తగ్గుతాయి.

# బీట్రూట్ ఎక్కువ తింటే కలిగే నష్టాలు?

బీట్రూట్ ని ఎక్కువగా కాకుండా మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా తింటే అనారోగ్యసమస్యల బారిన పడాల్సి ఉంటుందని అంటున్నారు.దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు ఎంతో ప్రమాదకరం. కాబట్టి ఆరోగ్యంగా ఉండాలి అంటే అతి తక్కువగా తీసుకోవడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మీరు బీట్ రూట్ లవర్స్ అయితే ఖచ్చితంగా మరింత జాగ్రతలు తీసుకోవాలి. లేదంటే అనారోగ్యసమస్యలు తప్పవని అంటున్నారు డాక్టర్లు.



# నారింజ ఎక్కువగా తింటే కలిగే నష్టాలు?



నారింజ పండు ఎక్కువగా తింటే కలిగే నష్టాలు ?నారింజ పండు ఎంత రుచిగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది ఆరోగ్యానికి కూడా చాలా విధాలుగా మేలు చేస్తుంది. అందుకే రుచికరమైన ఇంకా ఆరోగ్యకరమైన ఈ నారింజను ఎంతో ఇష్టంగా తింటారు. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటం వల్ల చలికాలంలో నారింజను తినమని వైద్యులు చెబుతుంటారు. అయితే కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు నారింజ పండు తినడం మంచిది కాదు. ఇది మీ ఆరోగ్య సమస్యను మరింత తీవ్రతరం చేయవచ్చు. కాబట్టి ఎవరు నారింజ తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం..దంత సమస్యలతో బాధపడేవారు నారింజను తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దంతాలు బలహీనంగా ఉన్నవారు నారింజకు దూరంగా ఉండాలి.ఆరెంజ్ పంటి ఎనామెల్‌తో పాటు, కాల్షియం బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. దీంతో దంతాల ఆరోగ్యం దెబ్బతింటుంది.


# గంటల తరబడి కుర్చీకే అతుక్కుపోతున్నారా.....?



నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ ప్రతి పనిని కూడా ఎంతో సులభతరం చేసింది అన్న విషయం తెలిసిందే. అయితే ఇలాంటి టెక్నాలజీ అటు మనిషి జీవనశైలిలో కూడా ఎన్నో మార్పులకు కారణమైంది.ఒకప్పుడు ఏ పని చేయాలన్నా చెమటోడ్చి కష్టపడేవాడు మనిషి. కానీ ఇప్పుడు టెక్నాలజీతో అన్ని పనులు ఇక ఒక్క చెమట చుక్క కూడా చిందించకుండానే పూర్తవుతున్నాయి. ఇక నేటి రోజుల్లో చేసే ఉద్యోగాలు అన్నీ కూడా ఒకే చోట కూర్చిలో గంటల తరబడి కూర్చుని చేసే ఉద్యోగాలే కావడం గమనార్హం. అయితే మొదట్లో ఇలాంటి ఉద్యోగాలతో బాగా రెస్ట్ దొరుకుతుందని ఇక ఇలాంటి ఉద్యోగం దొరకడం అదృష్టం అని అనుకునేవారు చాలామంది.

కానీ ఇక ఒకే చోట గంటల తరబడి కూర్చొని ఎన్నో ఆరోగ్య సమస్యలను మాత్రం కొని తెచ్చుకుంటున్నారు అని చెప్పాలి. ఇక నేటి రోజుల్లో సాఫ్ట్వేర్ రంగం దగ్గర నుంచి సాధారణ ఉద్యోగం వరకు కూడా ప్రతి ఒక్కటి కూడా ఇలా ఎలాంటి శారీరక శ్రమ లేకుండా.. ఒకే చోట కూర్చుని చేసే ఉద్యోగం చేస్తున్నారు.

# మాస్ మహారాజా ర్యాంపేజ్.. మూడు రోజుల్లో రూ.30 కోట్లు




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా వచ్చిన తాజా చిత్రం 'ఈగల్'. ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల మందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. మొదటిరోజు నుంచే ఈ సినిమా కలెక్షన్స్‌లో దూసుకుపోతుంది. తొలి రోజే రూ.11 కోట్లకుపైగా గ్రాస్ వసూళ్లతో చెలరేగిన ఈగల్.. తర్వాత రెండు రోజులు కూడా అదే దూకుడు కొనసాగించింది. మూడు రోజులు కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.30.6 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఇక ఈ మూవీలో అనుపమపరమేశ్వరన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. కావ్య థాపర్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటించారు. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే.. 'ఈగల్'.. సహదేవ్‌వర్మ(రవితేజ) నడుపుతున్న ఓ సీక్రెట్ నెట్‌వర్క్. అటు పోలీసులకూ, ఇటు నక్సలైట్లు, తీవ్రవాదులతోపాటు ఇతర దేశాలకు చెందిన కొందరు వ్యక్తులకు కూడా ఈ 'ఈగల్' ఓ లక్ష్యంగా ఉంటుంది. చిత్తూరుజిల్లా తలకోన అడవుల్లోని ఓ దూది మిల్లుతోపాటు, పోలెండ్‌లో కూడా సహదేవ్‌వర్మ నడుపుతున్న 'ఈగల్' యాక్టివిటీస్ బహిర్గతమవుతుంటాయి. ఈ వ్యవహారంపై జర్నలిస్ట్ నళిని రాసిన ఓ కథనంతో ఈ కథ మొదలవుతుంది. అది చిన్న కథనమే అయినా.. దేశంలో పెను ప్రకంపనాలకు దారితీస్తుంది. కారణం ఆ కథనం 'ఈగల్'కి చెందినది కావడమే. అసలు ఈ సహదేవ్ వర్మ ఎవరు? ఈగల్ నెట్‌వర్క్ టార్గెట్ ఏంటి? తలకోన అడవులకూ 'ఈగల్'కు గల సంబంధమేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

## 'స్వయంభు' కోసం సంయుక్త మీనన్ హార్స్ రైడింగ్..



టాలీవుడ్‌లో వరుస విజయాలతో జోరుమీదున్నారు హీరోయిన్ సంయుక్త మీనన్. సార్, విరూపాక్ష, డెవిల్ సినిమాలు సూపర్ హిట్ కావడంతో ఈ అమ్మడికి ఆఫర్స్ క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం సంయుక్త మీనన్.. యంగ్ హీరో నిఖిల్ కు జోడీగా స్వయంభు సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా కోసం నిఖిల్ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా సంయుక్త కూడా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ కోసం హార్స్ రైడింగ్ నేర్చుకుంటున్నారు సంయుక్త. గుర్రంపై కుర్చున్న ఫోటోను తాజాగా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "2024.. నా గురించి, నా జీవితం గురించి చాలా విషయాలు నేర్పించింది. జీవితంలో సాహసాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. నేనెప్పుడూ కంఫర్ట్ జోన్ లో ఉండాలనుకోను. ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలనుకుంటా. ప్రస్తుతం నా నెక్ట్స్ మూవీ స్వయంభు కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నాను. గుర్రంపై ప్రయాణం చేయడం నాకు చాలా ఇష్టం. నన్ను నమ్మండి ఈ ప్రయాణం ఖచ్చితంగా అద్భుతంగా ఉంటుంది" అని ఎక్స్ లో చెప్పుకొచ్చింది.




## నితిన్ సినిమాలో బాలీవుడ్ నటుడు.?

టాలీవుడ్ హీరో నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇక ఇప్పటికే ఈ సినిమా విడుదల చేసిన గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ లుక్‌లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలకపాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. నితిన్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సంజయ్‌దత్ ఈ సినిమాకు తీసుకున్నట్లు టాక్ నడుస్తుంది. దీనిపై చిత్రయునిట్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నితిన్ ఈ సినిమాలో దొంగగా కనిపించబోతున్నాడు. టకిరిటీ రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మిస్తున్నారు.



జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫర్ కాగా.. ప్రవీణ్ పూడి ఎడిటర్. రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్.

## హిలేరియస్‌గా వెన్నెల కిషోర్ 'చారి 111' ట్రైలర్




టాలీవుడ్ స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111'. తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా మార్చి 01న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. 1992లో ఇండియా - కిస్థాన్ కలిసి ఒక జాయింట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇకపై రెండు దేశాల్లో ఎలాంటి అణ్వాయుధాలు గానీ బయోలాజికల్ ఆయుధాలు కానీ తయారు చేయగూడదు అనే సంభాషణతో ట్రైలర్ మొదలవుతుంది. ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. టెర్రరిజంకు చెందిన ఒక సీక్రెట్ గ్రూప్ కోవర్ట్ ఏజెన్సీ స్టార్ట్ చేయాలనీ చూస్తుంది. ఒకవేళ అది స్టార్ట్ అయితే దేశానికి ప్రమాదం. ఇక ఇది కనిపెట్టే సీక్రెట్ స్పైగా ఏజెంట్‌గా వెన్నెల కిషోర్ కనిపించనున్నారు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో స్పై ఏజెన్సీ హెడ్?గా కనిపించనున్నారు. ట్రైలర్ మొత్తం ఫన్ ఎంటర్‌టైనర్‌గా సాగింది. ఈ సినిమాను బర్కత్ స్టూడియోస్ బ్యానర్‌పై అదితి సోని నిర్మిస్తుంది.

# రూ.16 కోట్ల విలువైన అమెజాన్ షేర్లు విక్రయించిన జెఫ్ బెజోస్



ఈ-కామర్స్ జెయింట్ అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ సంస్థలో తన షేర్లను విక్రయించారు. 12 మిలియన్ల షేర్లను గత బుధ, గురువారాల్లో విక్రయించారు. వాటి విలువ 200 కోట్ల డాలర్ల పై చిలుకు (సుమారు రూ.16 వేల కోట్లు). సంస్థ సీఈఓగా వైదొలిగిన తర్వాత 2021 నుంచి అమెజాన్‌లో జెఫ్ బెజోస్ తన షేర్లను విక్రయించడం ఇదే మొదటిసారి. వచ్చే 12 నెలల్లో అమెజాన్ సంస్థలో 50 మిలియన్ల షేర్లను విక్రయిస్తానని ఈ నెల రెండో తేదీన జెఫ్ బెజోస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక్కో షేర్ 168-171 డాలర్ల విలువకు విక్రయించినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్ లో ఆయన చెప్పారు. 2002 నుంచి అమెజాన్ వ్యవస్థాపకుడిగా జెఫ్ బెజోస్ 30 బిలియన్ డాలర్లకు పైగా విక్రయించాడు. 2020, 2021ల్లోనే సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించాడు. గత నవంబర్ నెలలో స్వచ్ఛంద సంస్థలకు దాదాపు 230 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను గిఫ్టులుగా పంపిణీ చేశారు. గత 12 నెలల్లో అమెజాన్ షేర్ 78 శాతం పెరిగింది.

# 12 నుంచి పసిడి బాండ్ల జారీ




**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ మరోమారు పసిడి బాండ్లను జారీ చేయనుంది. ఫిబ్రవరి 12 నుంచి 16వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుందని ఆర్‌బిఐ వెల్లడించింది. ఒక్కో గ్రాము ధరను రూ.6,263గా నిర్ణయించినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇప్పటి వరకు జూన్, సెప్టెంబర్, డిసెంబర్‌లో మూడు విడతలుగా బాండ్లను జారీ చేశారు. నాలుగో విడతలో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి గ్రాముకు రూ.50 డిస్కౌంట్ ఇస్తున్నారు. దీంతో ఒక్కో గ్రాము రూ.6,213కు లభించనుంది. కనీసం ఒక్క గ్రాము ఒక యూనిట్ కింద కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ బాండ్ పీరియడ్ 8 ఏళ్లు ముగిసిన తర్వాత అప్పటి ధరను చెల్లిస్తారు. ఐదేళ్ల తర్వాత కావాలంటే వైదొలగడానికి వీలుంది. అన్ని బ్యాంక్‌లు, తపాళ శాఖ, స్టాక్ ఎక్స్ఛేంజీలు, ఆర్‌బిఐ సహా పలు విత్త సంస్థల్లో పసిడి బాండ్లను కొనుగోలు చేయడానికి వీలుంది.

# చైనా ఎఫ్‌డీఐలపై ప్రభుత్వ పరిశీలన




టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో చాలాకంపెనీలు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని అనుకుంటాయి. అందుకు ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు కోరుతుంటాయి. అయితే కంపెనీలో ఏదైనా అవకతవకలు జరిగినట్లు అనుమానం వ్యక్తం అయితే ఆ కంపెనీ, ఇన్వెస్టర్లకు సంబంధించి ప్రభుత్వం సమగ్ర విచారణ చేపడుతుంది. తాజాగా పేటీఎంలో నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తించిన విషయం తెలిసిందే. దాంతో కంపెనీపై చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే పేటీఎంలో పెట్టుబడి పెట్టిన చైనా ఎఫ్‌డీఐలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వన్97 కమ్యూనికేషన్స్ చెల్లింపు విభాగమైన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ (పీపీఎస్‌ఎల్)లో పెట్టుబడి పెట్టిన చైనా ఎఫ్‌డీఐలను ప్రభుత్వం పరిశీలించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరిశీలనలు పూర్తయిన తర్వాత కమిటీ ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. పేమెంట్ అగ్రిగేటర్లు, పేమెంట్ గేట్‌వేల నియంత్రణపై ఉన్న మార్గదర్శకాల కింద 'పేమెంట్ అగ్రిగేటర్‌గా సేవలందించేందుకు అనుమతులు కోరుతూ' 2020 నవంబరులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దగ్గర పీపీఎస్‌ఎల్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకుంది. 2022 నవంబరులో పీపీఎస్‌ఎల్ దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించింది. ఎఫ్‌డీఐ నిబంధనల కింద ప్రెస్ నోట్ 3 నిబంధనలను పాటిస్తూ, మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆదేశించింది. వన్97 కమ్యూనికేషన్స్‌లో చైనా సంస్థ యాంట్ గ్రూప్ పెట్టుబడులు ఉండటమే ఇందుకు కారణం. ప్రెస్ నోట్ 3 ప్రకారం.. చైనా సహా, భారత్‌తో సరిహద్దు పంచుకున్న దేశాల నుంచి ఏ రంగంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులకు అయినా కేంద్రప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కొవిడ్-19 పరిణామాల్లో, దేశీయ సంస్థలను విదేశీయులు బలవంతంగా టేకోవర్ చేసుకుంటారనే ఉద్దేశంతో అటువంటివి నిరోధించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వన్97 కమ్యూనికేషన్స్‌లో చైనా సంస్థ యాంట్ గ్రూప్ పెట్టుబడులు ఉండటమే ఇందుకు కారణం. ప్రెస్ నోట్ 3 ప్రకారం.. చైనా సహా, భారత్‌తో సరిహద్దు పంచుకున్న దేశాల నుంచి ఏ రంగంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులకు అయినా కేంద్రప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

# పరిమిత శ్రేణిలోనే కదలికలు...!




దేశీయ సూచీలు ఈ వారం ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రభావం చూపే ప్రధాన వార్తలు లేకపోవడం, అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాల సీజన్ ముగియనుండటం ఇందుకు కారణమని చెబుతున్నారు. నిఫ్టీ-50కి 21,600 వద్ద మద్దతు లభించొచ్చనిబీ 22,000 వద్ద నిరోధం కనిపించొచ్చన్నది మార్కెట్ నిపుణుల అంచనా. ట్రేడర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఓ బ్రోకరేజీ సంస్థ అంటోంది. మార్కెట్ల మూలాలు బాగున్నప్పటికీ, లాభాల స్వీకరణతో వచ్చే వారాల్లో సూచీలు నష్టపోవచ్చని పేర్కొంది. సోమవారం వెలువడే 'జనవరి రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల' నుంచి సంకేతాలు తీసుకోవచ్చు. ఔషధ కంపెనీల ఫలితాలు బాగున్నందున, ఈ షేర్లు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లూ రాణించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. నిఫ్టీ బ్యాంక్ సానుకూలంగా ఒక శ్రేణిలో చలించొచ్చు. 44,500 వద్ద మద్దతు కనిపించొచ్చు. 46,050 పాయింట్ల పైన బలంగా పుంజుకోవచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకులపై దృష్టి సారించాలి. కొన్ని వారాలుగా నష్టపోతున్న ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు రాణించొచ్చు. దాదాపు అన్ని కంపెనీలు డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించేశాయి. వీటికి ప్రతికూలతలు ఏమీ కనిపించడం లేదు. ఐటీసీ షేర్లను పరిశీలించొచ్చు. ప్రధాన వార్తలేమీ లేనందున సిమెంటు షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు.

# అరుదైన పెట్టుబడుల అవకాశాలు..!




**న్యూఢిల్లీ :** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సంబంధించి ఎన్నో విధానాలు ఉన్నాయి. అందులో స్పెషల్ సిచ్యుయేషన్స్ థీమ్ కూడా ఒకటి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కొన్ని కంపెనీల ధరలు ఆకర్షణీయమైన స్థాయిలకు, చౌక విలువకు దిగి వస్తాయి. అలాంటప్పుడు వాటిల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలు ఆర్జించడమే స్పెషల్ సిచ్యుయేషన్స్ థీమ్‌లో కనిపిస్తుంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇండియా అపార్చునిటీస్ కూడా ఇదే మాదిరి పనిచేస్తుంటుంది. ఈ పథకానికి మెరుగైన రాబడుల చరిత్ర ఉంది. ఈ పథకంలో ఐదేళ్ల క్రితం ఒకే విడత రూ.లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఇప్పుడు అది రూ.2.8 లక్షలుగా మారి ఉండేది. ఈ పథకానికి ఐదేళ్ల చరిత్ర ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ సీఐవో శంకరన్ నరేన్‌తోపాటు, రోషన్ చట్కే దీని నిర్వహణ వ్యవహారాలు చూస్తున్నారు. ఈ పథకం 2019 జనవరి 15న మొదలైంది. ఆరంభం నుంచి చూస్తే ఈ పథకం ఏటా 22.9 శాతం చొప్పున కాంపౌండెడ్ వార్షిక రాబడులు (సీఏజీఆర్) అందించింది. ఈ పథకం పనితీరుకు బెంచ్‌మార్క్‌గా పరిగణించే నిఫ్టీ 500 టీఆర్‌ఐ ఇదే కాలంలో ఇచ్చిన రాబడి 19 శాతంగానే ఉంది. మూడేళ్ల కాలంలో ఏటా 37.7 శాతం చొప్పున రాబడి అందించగా, నిఫ్టీ 500 టీఆర్‌ఐ రాబడి 19.8 శాతంగానే ఉంది. సూచీ కంటే 17.9 శాతం అధిక రాబడిని అందించినట్టు తెలుస్తోంది. ఏడాది కాల రాబడి చూసినా 38 శాతంగా ఉంది. ఇదే కాలంలో సూచీ రాబడి 30 శాతమే కావడం గమనించాలి.

# ప్రత్యక్ష పన్ను వసూళ్లు అదుర్స్.......




గత ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 20 శాతం పెరిగి రూ.15.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం ఇది 80 శాతం. 'ప్రత్యక్ష పన్ను వసూళ్లలో స్థిరమైన గ్రోత్ నమోదవుతున్నది. ఈ నెల 10 వరకు ప్రత్యక్ష పన్ను వసూళు స్థూలంగా రూ.18.38 లక్షల కోట్లు. గతేడాది (2022-23)తో పోలిస్తే 17.30 శాతం ఎక్కువ' అని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 10 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్లలో నికర వసూళ్లు రూ.15.60 లక్షల కోట్లుని సీబీడీటీ వివరించింది. గతేడాదితో పోలిస్తే 20.25 శాతం ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 80.23 శాతం పెరుగుదల నమోదైంది.

# ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన......!




**న్యూఢిల్లీ :** దేశంలో డిజిటల్ పేమెంట్ల వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. అంతే స్థాయిలో ఆన్‌లైన్ మోసాలు కూడా పెరిగిపోతున్న నేపథ్యంలో అడిషనల్ ఫ్యాకర్ట్ అథెంటికేషన్ అంశానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎస్‌ఎంఎస్ ఆధారిత వన్ టైమ్ పాస్‌వర్డ్ ప్రామాణీకరణను తొలగించడానికి ఆర్బీఐ సిద్ధమైంది. దీనికి సంబంధించి ఆర్బీఐ ప్రస్తుతానికి ఎటువంటి వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేయలేదు కానీ తమ వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 8న విడుదల చేసిన డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ పాలసీలపై స్టేట్‌మెంట్‌లో దీన్ని ప్రస్తావించింది. డిజిటల్ పేమెంట్ లావాదేవీల ప్రామాణీకత కోసం మెరుగైన విధానాన్ని అనుసరించాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన ఆదేశాలు ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం మనం ఏదైన ఆర్థిక లావాదేవీని డిజిటల్‌గా నిర్వహించినప్పుడు అథెంటికేషన్ కోసం ఫిన్‌టెక్ సంస్థ లేదా బ్యాంక్ ఖాతాకు లింక్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేస్తేనే లావాదేవీని పూర్తి చేయడానికి వీలవుతుంది. బ్యాంక్ ఖాతాల భద్రతను నిర్ధారించడానికి, చట్టవిరుద్ధంగా పొందిన ఆర్థిక డేటా దుర్వినియోగాన్ని నిరోధించడానికి ఈ అడిషనల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఒక కీలక దశ. ఆర్‌బీఐ నిర్దిష్ట ఏఎఫ్ఏని నిర్దేశించనప్పటికీ చెల్లింపుల వ్యవస్థ ఎక్కువగా ఎస్ఎంఎస్-ఆధారిత వన్-టైమ్ పాస్‌వర్డ్‌ని అనుసరిస్తోంది. అయితే ప్రస్తుతం టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నో ప్రత్యామ్నాయ ప్రమాణీకరణ యంత్రాంగాలు వచ్చాయి. డిజిటల్ చెల్లింపు లావాదేవీల ప్రామాణీకరణ కోసం ఇటువంటి యంత్రాంగాల వినియోగాన్ని పరిశీలించాలని ఆర్బీఐ సూత్రప్రాయ ప్రతిపాదనలు చేసింది.

# ఇపిఎఫ్‌పై 8.25 శాతం వడ్డీ....




**న్యూఢిల్లీ :** ఉద్యోగ, కార్మికులకు చెందిన ప్రావిడెంట్ ఫండ్‌పై 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 8.25 వడ్డీ చెల్లించనున్నారు. దీనిపై శనివారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి)లో నిర్ణయం తీసుకున్నట్లు ఇపిఎఫ్ఒ వర్గాలు తెలిపాయి. ఇపిఎఫ్ఒ సిబిటి సమావేశానికి కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనాశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. సిబిటి ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతులు లభించాల్సి ఉంది. ప్రభుత్వం ఆమోదం తర్వాత అధికారికంగా నోటీఫై చేస్తారు. అనంతరం వడ్డీ మొత్తాన్ని చందాదారుల ఖాతాల్లో జమ చేస్తారు. కాగా.. గత ఆర్థిక సంవత్సరం ప్రావిడెంట్ ఫండ్‌పై 2022-23లో 8.15 శాతం వడ్డీ చెల్లించారు. దీంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వడ్డీ చెల్లింపుల్లో స్వల్ప పెరుగుదల ఉంది. 2018-19లో 8.65 శాతంగా ఉన్న వడ్డీ రేటుకు మోడీ ప్రభుత్వం క్రమంగా కోత పెట్టింది. 2021-22లో ఏకంగా 8.1 శాతానికి కోత పెట్టి.. నాలుగు దశాబ్దాల కనిష్టానికి తగ్గించారు. తిరిగి గడిచిన 2022-23లో 8.15 శాతం వడ్డీ రేటు అందించారు. ఇపిఎఫ్‌లో దాదాపు 6 కోట్ల మంది చందాదారులు ఉన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇపిఎఫ్‌పై వడ్డీని 8 శాతానికే పరిమితం చేస్తారని తొలుత రిపోర్టులు వచ్చినప్పటికీ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తే నష్టపోతామనే ఉద్దేశ్యంతో బిజెపి ప్రభుత్వం అంచనాల కంటే స్వల్పంగా పెంచి ఇవ్వడానికి ఆసక్తి చూపిందని తెలుస్తోంది. ఇపిఎఫ్ఒ సిబిటి సమావేశానికి కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనాశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. సిబిటీ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతులు లభించాల్సి ఉంది. ప్రభుత్వం ఆమోదం తర్వాత అధికారికంగా నోటీఫై చేస్తారు. అనంతరం వడ్డీ మొత్తాన్ని చందాదారుల ఖాతాల్లో జమ చేస్తారు. కాగా.. గత ఆర్థిక సంవత్సరం ప్రావిడెంట్ ఫండ్‌పై 2022-23లో 8.15 శాతం వడ్డీ చెల్లించారు.

## యుఎఇ అధ్యక్షుడితో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు



న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించడంతోపాటు కొత్త రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడంపై వారు చర్చలు జరిపారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంతోసహా అనేక ఒప్పందాలపై వారి సమక్షంలో జరిగాయి. అధ్యక్షుడు జాయేద్ విమానాశ్రయం వద్ద ప్రధాని మోడీకి సాదర స్వాగతం పలికారు. ఇద్దరు నాయకులు పరస్పర ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ప్రధాని మోడీ గౌరవ వందనం స్వీకరించారు. అబు దాబి విమానాశ్రయంలో తనకు స్వాగతం పలికేందుకు ప్రత్యేకంగా వచ్చినందుకు అధ్యక్షుడికి ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. ఇద్దరు నాయకులు ముఖాముఖీ చర్చలతోపాటు ప్రతినిధి స్థాయి చర్చలలో పాల్గొన్నారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించిన ఇద్దరు నాయకులు సహకారానికి సంబంధించి కొత్త రంగాలపై చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, ఫిన్‌టెక్, ఇంధనం, మౌలిక సౌకర్యాలు, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలతోసహా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకోవడాన్ని వారు స్వాగతించారు. వారి మధ్య ప్రాంతీయ, అంతర్జాతీయ అంశబూలు కూడా చర్చకు వచ్చాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గడచిన ఏడు నెలలలో తామిద్దరం ఐదుసార్లు కలుసుకున్నామని, నేడు ప్రతి రంగంలో రెండు దేశాల మధ్య పరస్పర భాగస్వామ్యం ఉందని ప్రధాని మోడీ తెలిపారు. ఇద్దరు నాయకుల సమక్షంలో భారత్, యుఎఇ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎలెక్ట్రికల్ ఇంటర్‌కనెక్షన్, వాణిజ్య రంగంలో సహకారంపై రెండు దేశాల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. పశ్చిమాసియా ఆర్థిక కారిడార్‌పై ఇరు దేశాల మధ్య అంతర్ ప్రభుత్వ ముసాయిదా ఒప్పందం కుదిరింది. మొత్తం ఎనిమిది ఒప్పందాలు రెండు దేశాల మధ్య కుదిరినట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

# ఢిల్లీలో కాంగ్రెస్‌కు...

# ఒకే ఒక్క సీటు!

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన సీట్ల పంపకాలపై ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలైన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కాంగ్రెస్ పార్టీల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకునే అవకాశం కనపడుతోంది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ నియోజకవర్గాలలో కేవలం ఒక్కంటే ఒక్క స్థానాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీకి కేటాయిస్తామని ఆప్ తెగేసి చెప్పింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. అయితే ఆప్ ఎంపి సందీప్ పాఠక్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాలు సాధ్యమయ్యేనా అన్న అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రతిభ ప్రాతిపదికన చూస్తే కాంట్రెస్‌కు ఢిల్లీలో ఒక్క సీటును కూడా పొందే అర్హత లేదు. కాని పొత్తు ధర్మాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీకి ఢిల్లీలో ఒక సీటు ఇస్తాం. కాంగ్రెస్ పార్టీ ఒక సీటులో, ఆప్ ఆరు సీట్లలో పోటీ చేయాలని మేము ప్రతిపాదిస్తున్నాము అంటూ పాఠక్ వ్యాఖ్యానించారు. కాగా..గతంలో ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో మెజారిటీ అసెంబ్లీ స్థానాలను ఆప్ కైవసం చేసుకోవడంతో పొత్తు చర్చల్లో ఆప్‌దే పైచేయిగా ఉంది. అయితే దేశ రాజధానిలో వరుస అపజయాలను చవిచూసిన కాంగ్రెస్ తన పూర్వ వైభవాన్ని సాధించుకోవడానికి ప్రయత్నిస్తోంది. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఢిల్లీలో ఒక్క సీటును కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది.

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మొత్తం 250 స్థానాలలో 9 స్థానాలను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుంది. ఇలా ఉండగా. లోక్‌సభ ఎన్నికకు సంబంధించిన .సీట్ల పొత్తుపై జరిగిన ప్రాథమిక చర్చలలో 4:3 సూత్రాన్ని కాంగ్రెస్ ప్రతిపాదించింది. కాంగ్రెస్ 4 స్థానాలలో, ఆప్ 3 స్థానాలలో పోటీ చేయాలని కాంగెస్ ప్రతిపాదిచింది.

అయితే పాఠక్ ప్రకటన ప్రకారం ఉభయ పక్షాలకు సంతృప్తిని కలిగించే ఏకాభిప్రాయం కుదరలేదన్న సూచనలు కనపడుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీలోని మొత్తం 7 స్థానాలను బిజెపి కైవసం చేసుకోగా కాంగ్రెస్, ఆప్‌లకు మొండి చెయ్యి మిగిలింది. ఇండియా కూటమిలోని మిత్ర పక్షాల మధ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆప్ నుంచి ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాలలో తామే పోటీ చేస్తామని అధికార ఆప్ ప్రకటించడంతో కాంగ్రెస్ కూడా ఒంటరి పోరుకే సిద్ధపడుతోంది. పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలు ఉండగా చండీగఢ్‌లో ఒక స్థానం ఉంది. మొత్తం కలిపితే 14 స్థానాలు అవుతాయి. ఈ 14 స్థానాలకు ఆప్ తన అభ్యర్థులను ప్రకటిస్తుందని, ఈ 14 స్థానాలలో ఆప్ అభ్యర్థులు గెలుపొందే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని గత శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక ర్యాలీలో పిలుపునిచ్చారు. హర్యానా, గోవా వంటి రాష్ట్రాలలో కూడా తమకు సీట్లు కేటాయించాలని ఆప్ డిమాండు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల పొత్తు చర్చలు జటిలమవుతున్నాయి. తన విజయావకాశాలను నీరుగార్చుకోవడం ఇష్టం లేని కాంగ్రెస్ ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తోంది.





# ప్రగల్భాలు వద్దు... సభలో చర్చకు రావాలి

- కాళేశ్వరం అవినీతి బయటపడుతుందనే కుట్రతో నల్లగొండలో సభ
- చావు నోట్లో తలకాయ పెట్టారని కోటి ఒకటోసారి కెసిఆర్ మాట్లాడారు
- గత పాలకుల నిర్వాకంతోనే ప్రాజెక్టులకు ఈ దుస్థితి నెలకొంది
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు ముందు ఉత్తర ప్రగల్భాలు పలకకుండా శాసనసభలో జరిగే చర్చకు మాజీ సిఎం కెసిఆర్ హాజరు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో వేల కోట్ల దోపిడీపై చర్చ జరగకుండా ఉండాలనే కుట్రలతో కెసిఆర్ నల్లగొండలో సభ పెట్టి ప్రజల దృష్టి మళ్లించాడనికి ఎత్తుగడ వేశాడని మండిపడ్డారు. మంగళవారం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ముందు తన బండారం బయటపడుతుందనే నల్లగొండలో నిర్వహించిన సభలో మాపై ఎదురుదాడికి దిగారని, చావు నోట్లో తలకాయ పెట్టానని కేసీఆర్ కోటి ఒకటవసారి అబద్ధం చెప్పారని ఎద్దేవా చేశారు. సత్య హరిశ్చంద్రుడు అయితే శాసనసభలో చర్చకు ఎందుకు రాలేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, నీ ఏజెంట్ హరీశ్‌రావు సభలో అసత్యాలు మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారన్నారు. మీరు చేసిన నిర్వాకంపై సభలో ఆధారాలతో సహా బయటపెట్టామని, మేడిగడ్డ సందర్శనకు రావాలని మా మంత్రి లేఖ రాశారని, తాము నిర్ణయించిన తేదీపై అభ్యంతరం ఉంటే మీరు చెప్పిన తేదీనే వెళదామని చెప్పిన ఎందుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పర్యటనకు రాలేదని నిలదీశారు. కాలు విరిగిందని డ్రామాలాడి అసెంబ్లీకి రాని కెసిఆర్ నల్లగొండ సభకు ఎలా వెళ్లారని,నల్లగొండ దూరమా, అసెంబ్లీ దూరమో ఒక ఆలోచించి మాట్లాడాలని సూచించారు. నాలుగైదు పిల్లర్లు కూలాయని చులకనగా మాట్లాడుతున్నారని, మీ లక్ష కోట్ల దోపిడీకి కాళేశ్వరం బలై పోయిందని మేడిగడ్డ సమస్యను చులకన చేసి మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కెఆర్ఎంబిపై తాను సలహాలు ఇచ్చేవాడినని సభలో అనడం పెద్ద గొప్పకాదని, దమ్ముంటే శాసనసభకు వచ్చి సలహాలు ఇవ్వాలని గతం నుంచి చెబుతామని గుర్తు చేశారు. తీర్మానంలో లోపాలు ఉంటే హరీష్ రావు ఎలా మద్దతు ఇచ్చారని, అందుకే వారి మాటలకు విలువ లేదని కెసిఆర్ సభకు రావాలని తాము కోరామని,నల్లగొండ సభలో దిక్కుమాలిన మాటలు మాట్లాడటం కాదు, శాసనసభకు వచ్చి సత్తా చూపించాలని పేర్కొన్నారు. తమ పార్టీ నేతలు వెంటాడుతామంటూ అంటూ బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారని, కాళేశ్వరంపై చర్చకు రావడానికి మీరు ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీ కార్యదర్శి మీ అనుమతి లేకుండానే లేఖ రాశారా మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ పదే పదే మాట్లాడుతున్నారని,నీ గురించి ప్రజలకు ముందే తెలిసి ఉంటే ఆ ప్రతిపక్ష హోదా కూడా వచ్చేది కాదన్నారు. కుర్చీ పోగానే కెసిఆర్‌కు నీళ్లు, నల్లగొండ ఫ్లోరైడ్ గుర్తొస్తాయని, ఆయన మాట్లాడే అబద్దాలు నమ్మడానికి తెలంగాణ సమాజం ఇంకా సిద్ధంగా ఉందనుకోవడం మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కెసిఆర్‌ను ఈ వేదికగా ఆహ్వానిస్తున్నా బుధవారం జరిగే ఉదయం సభకు హాజరై బడ్జెట్ తో పాటు, సాగునీటి రంగంపై చర్చలో పాల్గొనాలని కోరారు.



**ప్రతిపక్ష నేతగా ప్రజలకు మేలు చేయాలి:**

రాష్ట్రంలో అన్ని పాపాలకు కెసిఆర్ కారణమని స్వార్థం కోసం కాకుండా ఒక్కసారైనా ప్రజలకు మేలు జరిగేలా ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యత నెరవేర్చుకోవాలని,మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు స్పష్టంగా కమిపిస్తున్నా చిన్న సంఘటనగా చెప్పడం సరికాదన్నారు. తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, కాళేశ్వరంపై జరిగిన అవకతవకలపై మీ వైఖరేంటో శాసన సభలో చెప్పాలన్నారు. కుర్చీ పోయిందని, కుర్చీని వెతుక్కుంటూ నల్లగొండ దారి పట్టాడని, పార్లమెంటు ఎన్నికల్లో సానుభూతితో ఓట్లు పొందాలని రాజకీయ ఎత్తుగడలు వేశారని ఆరోపించారు. భయపడనని ప్రగల్భాలు పలకడం కాదు వచ్చి సభలో మాట్లాడాలని, సభలో కాళేశ్వరం అవినీతి చర్చకు రాకుండా ఉండేందుకే నల్లగొండలో సభ పెట్టాలరన్నారు. కెసిఆర్ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని, ఆయన కాళేశ్వరానికి కాదు ఇక కాశీకి వెళ్లి సన్యాసం పుచుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు.

**బిఆర్ఎస్, బిజెపివి చీకటి పొత్తులు: సిఎం రేవంత్‌రెడ్డి**

బిజెపి, బిఆరెస్ ఇంకా ఎన్నాళ్లు చీకట్లో పొత్తు పెట్టుకుంటారని, ఇలాంటి దొంగ కుట్రలో రెండు పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిచెందాయని రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ సందర్శనకు బిజెపి ఎమ్మెల్యేలు వాళ్లు వస్తారని అనుకున్నామని, కెసిఆర్ అవినీతిపై విచారణ చేపట్టాలన్న ఆపార్టీ సభ్యులు పర్యటకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బిజెపి వైఖరేంటో ఇప్పటికైనా స్పష్టంచేయాలని, మాజీ సిఎం అవినీతికి సహకరిస్తారో అవినీతిపై విచారణ చేసే మా ప్రభుత్వానికి సహకరిస్తారో తేల్చుకోవాలన్నారు. గత ప్రభుత్వం అవినీతిని బయటపెట్టడానికి ఈ పర్యటన కీలకమని,అలాంటి మేడిగడ్డ సందర్శనకు బిజెపి ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.

**కోటి ఎకరాలకు సాగు నీరు ఎక్కడ అందించలేదు:**

కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కోటి ఎకరాలకు సాగు నీరు అందించాం అని గత ప్రభుత్వం చెప్పిన మాట అంతా అబద్ధమని, లక్ష కోట్లు ఖర్చు చేసిన లక్ష ఎకరాలకు కూడా గత ప్రభుత్వం సాగునీరు ఇవ్వలేదన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్వహణ, విద్యుత్ బిల్‌కు ఏటా రూ. 25 వేల కోట్ల బడ్జెట్ అవసరమన్నారు. 2020లోనే మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపం ఉందని ఇరిగేషన్ అధికారులు ఎల్‌అండ్ టికి లేఖ రాసిన అప్పటి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందన్నారు. మేడిగడ్డ, అన్నారం,సుందిల్ల బ్యారేజిలు మూడు ఒకే టెక్నాలజీ, నైపుణ్యంతో నిర్మించారని, ఒకే విధమైన సమస్యలు ఈ మూడింటిలో ఉత్పన్నం అవుతున్నాయన్నారు. ఈ సమస్యను కప్పిపుచ్చేందుకు అసెంబ్లీ ఎన్నికల ముందు నీటిని తొలగించారని, నీరు పూర్తి సామర్థ్యం మేరకు నింపితే లోపాలు బయటపడినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నుండి ఏటా 180 టిఎంసిల నీటిని ఎత్తి పోయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికీ ఒక్క సంవత్సరం కూడా ప్రతిపాదిత లక్ష్యం చేరుకోలేదని, 2020 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అధికారులు లోపాలు ఉన్నట్లు ఎల్‌అండ్‌టికి నోటీస్‌లు జారీ చేసిన సంగతి గుర్తు చేశారు. ఇప్పుడు గత ప్రభుత్వ బాధ్యులు, నిర్మాణ సంస్థ బ్యారేజి కుంగుబాటుకు మా బాధ్యత లేదని చెబుతుందని, కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్, నిర్మాణాలు, నిర్వహణలో లోపాలు ఉన్నాయన్నారు. కాగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కాళేశ్వరం ప్రాజెక్ట్ లో దోపిడీ జరిగిందని చెప్పాయన్నారు. వీటి రిపోర్టు ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ లో దోపిడీ పై ఈ బడ్జెట్‌లో చర్చ పెట్టాలని భావించామని, కృష్ణానది పైన ప్రాజెక్ట్ లను కెఆర్ఎంబికి ఇచ్చారని తమ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నీళ్ల కోసం చావోరేవో: కేసీఆర్

కృష్ణా జలాల కోసం చావో రేవో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపునిచ్చారు. నీళ్ల లేకపోతే బతుకు లేదని చెబుతూ, కృష్ణా జలాల కోసం మరో పోరాటం చేయాలన్నారు. నల్లగొండ శివారులోని మర్రిగూడ బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన 'చలో నల్లగొండ' బహిరంగ సభలో మాట్లాడారు.

జై తెలంగాణా అంటూ ప్రసంగం మొదలు పెట్టిన కేసీఆర్ మీరు అనుమతిస్తే, కూర్చుని మాట్లాడతానంటూ సభికులను కోరారు. ఆ తర్వాత కూర్చునే ఆయన ప్రసంగాన్ని కొనసాగించారు. 'కొందరు సన్నాసులు ఈ సభ తమకు వ్యతిరేకం అనుకుంటున్నారు. కానీ ఇది రాజకీయ సభ కాదు. పోరాట సభ. నీళ్లకోసం ఉవ్వెత్తున మనం ఎగసిపడకపోతే ఎవరూ మన రక్షణకు రారు. బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు, కేంద్ర మంత్రులకు, మన నీళ్లను ఎత్తుకుపోయేవారికీ ఈ సభ ఒక హెచ్చరిక. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఇది జీవన్మరణ సమస్య. కాలు విరిగినా, కట్టె పట్టుకుని ఎందుకు వచ్చానంటే, ఈ సమస్య తీవ్రతను గుర్తించే. నల్లగొండ జిల్లాలో లక్షా యాభై వేల మంది ఫ్లోరోసిస్ బాధితులు ఉండేవారు. అప్పట్లో ఫ్లోరైడ్ ఉద్యమ నేతలతో కలసి కొందరు ఫ్లోరైడ్ బాధితులను ఢిల్లీ తీసుకువెళ్లి , ప్రధానమంత్రి టేబుల్ మీద పండబెట్టి ఇవీ మా బతుకులంటే ఎవరూ పట్టిచుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నల్లగొండను జీరో ఫ్లోరైడ్ చేసింది. తెలంగాణాకు నేనేమీ తక్కువ చేయలేదు. నిమిషం కూడా కరెంటు పోకుండా చూశాను. ప్రతి ఇంట్లో నల్లా పెట్టి మంచినీళ్లు అందించాను. నల్లగొండలో లక్షల టన్నుల వడ్లు పండించే స్థితికి తీసుకొచ్చాను' అని కేసీఆర్ చెప్పారు.

**పాలిచ్చే బర్రెను వదిలి, దున్నపోతును తెచ్చుకున్నారు**

కృష్ణా జలాలపై మాట్లాడుతూ ట్రిబ్యునల్ వేసేందుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తే, వందలాది ఉత్తరాలు రాశామనీ, వారం రోజులపాటు లోక్ సభలో కార్యకలాపాలు జరగనియ్యలేదనీ చెప్పారు. ఆ ఒత్తిడికి తలవొగ్గి ట్రిబ్యునల్ వేశారని కేసీఆర్ చెప్పారు. 'అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ట్రిబ్యునల్ ముందు గట్టిగా వాదించి మన అవసరాలు చెప్పి, మా వాటా ఇంత రావాలని కొట్లాడాలి. మగాడు చేయాల్సిన పని అది. ఇప్పటి ప్రభుత్వం కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగిస్తూ అప్పనంగా సంతకం పెట్టేసింది. ఆ వెంటనే హరీశ్ రావు గర్జించాడు. నాలుగైదు రోజులు అబద్ధాలాడారు. దాంతో బడ్జెట్ పై చర్చను పక్కనబెట్టి తీర్మానం చేశారు. అయినా తప్పు చేశారు. తీర్మానంలో సాగు, తాగు నీళ్ల గురించి చెప్పారే గానీ కరెంటు ఉత్పత్తి గురించి పేర్కొనలేదు. మరి మీకేం కోపం వచ్చిందో గానీ పాలిచ్చే బర్రెను వదిలి, దున్నపోతును తెచ్చుకున్నారు' అని జనాన్ని ఉద్దేశించి అన్నారు.

**'దద్దమ్మల రాజ్యంలో అట్లనే ఉంటది'**

'అధికారంలోకి వచ్చిన కొత్త గవర్నమెంట్ ఏం చేయాలి? పోయిన గవర్నమెంటు కన్నా నాలుగు మంచి పనులు చేయాలి. కాని ఈ ప్రభుత్వం ఒక్కటన్నా మంచి మాట చెబుతోందా? పొద్దున లేస్తే కేసీఆర్ ను తిట్టాలి. కేసీఆర్ ని తిడితే పెద్దోళ్లవుతారా? అసెంబ్లీలో ఎలా దుర్భాషలాడుతున్నారో చూస్తూనే ఉన్నారు కదా? అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణా ప్రజల పక్షాన పోరాడతాం. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడెనిమిది నెలల తర్వాత 24 గంటల కరెంటివ్వడం మొదలుపెట్టాం. కేసీఆర్ పోగానే కరెటు బందయింది. మరి కరెంటుకు ఏం రోగమొచ్చింది? దద్దమ్మల రాజ్యం ఉంటే అట్లనే ఉంటది. చవటల రాజ్యం ఉంటే అట్లనే ఉంటది' అన్నారు. అసెంబ్లీలోనే ఈ ప్రభుత్వం జనరేటర్ పెట్టిందని ఎద్దేవా చేస్తూ, జనమంతా మా కరెంట్ ఏమైందని అడగాలని కేసీఆర్ సూచించారు.

ఈ ప్రభుత్వానికి రైతు బంధు ఇవ్వడానికి కూడా చేతకావట్లేదని అన్నారు. ఇవ్వకపోతే ఇవ్వకపోయారు, రైతు బంధు అడిగితే అన్నదాతని చెప్పుతో కొట్టండని అంటున్నారని చెబుతూ చెప్పులు రైతులకు కూడా ఉంటాయని ఆయన అన్నారు. తాము రైతుల అకౌంట్లలో రైతు బంధు నిధులు వేసిన వెంటనే వాళ్ల ఫోన్లలో సమాచారం టింగు టింగుమని వచ్చేదని, ఇప్పుడు నిధులూ లేవు, టింగుటింగుమని ఫోన్లు మోగడమూ లేదని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ ని బయట తిరగనియ్యమని అంటున్నారు. మీరు అంత మొగాళ్లా? తెలంగాణా తెచ్చిన కేసీఆర్ నే తిరగనియ్యరా? చంపేస్తారా.. రండి చూద్దాం' అని కేసీఆర్ సవాల్ విసిరారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com